57 356

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 12, 2008



అవనిపై ఆకలి... ఆపసోపాలు

హ్యాపీబర్త్‌డే

(2008 అక్టోబర్ -12 నుంచి
2008 అక్టోబర్-18 వరకు)

ఆయిషా ఖాతున్
5సం॥, అక్టోబర్-2003
షంషాద్-జాఫర్‌బేగ్
పీలేరు-చిత్తూరు

ఎ. సుదర్శిని
అక్టోబర్-15
దాక్షాయని-సుబ్రమణ్యం
చిత్తూరు

అర్షద్ అలిబేగ్
9సం॥, అక్టోబర్-1999
షంషాద్-జాఫర్‌బేగ్
పీలేరు-చిత్తూరు

ఎస్. గాయత్రి ఫణిశ్రీ
9సం॥, అక్టోబర్-1999
శ్రీదేవి-శ్రీనివాసరావు
రుద్రంపూర్-ఖమ్మం

సిహెచ్. సాయి కార్తీక్
4సం॥, అక్టోబర్-2004
లక్ష్మి-త్రినాథ్‌రావు
నక్కపల్లి-విశాఖపట్నం

టి.జయంత్
అక్టోబర్
రమాదేవి-రమణప్రసాద్
విజయవాడ

భవానీ భాషిత
1సం॥, అక్టోబర్-2007
లక్ష్మి-జగదీష్
అనకాపల్లి-విశాఖపట్నం

నైపుణ్యానికి పదును పెట్టుకోవాలి



మన అతిథి

పేరు	: డాక్టరు బొడ్డు కృష్ణగాంధీ
స్వస్థలం	: పునాదిపాడు గ్రామం , కలికిపాడు మండలం (కృష్ణా జిల్లా)
పుట్టిన తేదీ	: 01-09-1953
తల్లిదండ్రులు	: బొడ్డు నకులుడు, బొడ్డు లిల్లమ్మ
విద్యాభ్యాసం	: బిఎస్సీ- ఆంధ్ర లయోలా కాలేజీ, విజయవాడ. ఎమ్మెస్సీ- ఆంధ్ర యూనివర్శిటీ, విశాఖపట్నం. పిహెచ్‌డి - ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
వృత్తి	: వైస్‌ఛాన్సలర్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, అనంతపురం
నచ్చిన వ్యక్తులు	: మహాత్మాగాంధీ, అబ్దుల్‌కలాం, మదర్‌థెరిస్సా
బలహీనతలు	: ఏమీ లేవు
బలం	: ఆత్మవిశ్వాసం, సహోద్యోగుల సహకారం
అభిరుచులు	: పుస్తక పఠనం, ప్రజాసేవ, సంగీతం
మరిచిపోలేనిది	: 2007 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం
పర్యటించిన ప్రదేశాలు	: ఇండియా దాటి వెళ్లలేదు
రాసిన పుస్తకాలు	: ఇంటర్, డిగ్రీ, బిఎస్సీ,బి.ఎ, ఎమ్‌సిఎ, ఇంజనీరింగు వంటి కోర్సులకు 11 టెస్టు బుక్కులు రాశాను. గణితం(పిహెచ్‌డి)లో నంబరు థియరీపై ఎనాలిసిస్.

ఇంజనీరింగు వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారికి భారతదేశంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. కమ్యూనికేషన్ స్కిల్లును అభివృద్ధి చేసుకోవడం ద్వారా దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలున్నాయి. అన్ని రంగాల్లో బాగా రాణిస్తుండటంతో మనవాళ్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. కృషి, పట్టుదలతో కష్టపడి ముందుకెళితే అన్నింటా విజయం మనదే అవుతుంది. సాంకేతికంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అన్వయించుకుంటూ నైపుణ్యానికి పదును పెట్టుకోవాలి.

ఈ సంచికలో....

టపా ... 2
సమ్‌థింగ్ స్పెషల్ ... 3
చూద్దామా ... 4
కథ ... 6
విజ్ఞాన వీచిక ... 8
సినిమా ... 10
రుచి ... 11
బాలనేస్తాలు ... 12

ఇంకా...

ఆరోగ్యం ...17
ధూమపానం మానడానికి పంచ సూత్రాలు

బాల వికాసం... 9
అమ్మా నాన్నల అతి శ్రద్ధ పసిపిల్లలకు గుదిబండ

అట్టమీది కథ ... 14
మనసా... తెలుసా ... 21
లాహిరిలో ... 22
కొత్త పుస్తకాలు ... 24

మంచి పుస్తకం ... 18
శ్రమ వీరుని అమరగాధ





రంజాన్ రుచులు తీపి గుర్తులు

సెప్టెంబర్ 28న ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురించిన రంజాన్ రుచులు మాకు తీపి గుర్తులనిచ్చాయి. చూద్దామాలో మ్యూజియంలో ఉన్న బొమ్మలు సందర్శకులకు తీయని అనుభూతి, మరచిపోలేని జ్ఞాపకం. ఆసక్తికరంగా సాగుతోంది లాహిరి లాహిరిలో... దేశ ప్రజల అభిమానాన్ని చూరగొన్న మెలోడీ క్వీన్ లతా మంగేష్కర్, ఆశా, రఫీ చక్కటి స్వరాగాలతో ఆరోజుల్లో తిరుగులేని చరిత్ర సృష్టించారు. హ్యాపీబర్త్‌డే, కలం స్నేహంతో పిల్లలు ఆనందిస్తున్నారు.

మత్తుర్తి గంగా భవాని,
విజయనగరం.

ధన్యవాదాలు

ఆదివారం అనుబంధం లో ప్రచురించిన రంజాన్ రుచులు బాగున్నాయి. రంజాన్, బక్రీద్ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకొనే పండుగలు. ఆరోజున మసీదుకి వెళ్లి ప్రార్థనలు చేసి ఈద్ ముబారక్, సలామ్ ఆలేకుమ్ అని అభివాదం తెలుపుకుంటారు. అంతే కాకుండా కుటుంబసభ్యులంతా కలిసి నెల రోజులపాటు ప్రార్థనలు చేసి...మంచినీళ్లు కూడా తాగకుండా ఉపవాస దీక్షచేసి... ఖురాన్ పఠనం చేసి ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగగా చెప్పవచ్చు. అటువంటి రంజాన్ సందర్భంగా రుచిచూసే వంటకాల గురించి తెలియచేసినందుకు ధన్యవాదాలు. సినిమా కబుర్లులో మమతా మోహన్ దాస్‌ని వెండితెర మీద పరిచయం చేసిన రాజమౌళి గారికి అభినందనలు. ఆమె తన ప్రతి సినిమాలో ఏ సన్నివేశంలోనైనా చాలా చక్కగా నటిస్తుంది. ఆమె యమదొంగ చిత్రంలో నటించి తెలుగు అభిమానులకు దగ్గరయ్యారు. ఆమె సినిమాలు విజయవంతమై, పేరు తెచ్చుకోవాలని కుటుంబ సభ్యులం కోరుకుంటున్నాము. ఈవారం లాహిరి లాహిరిలో గాయనీగాయకుల గురించి వివరించారు. ప్రతి మనిషిలో రాగం ఉంటుంది. పాటలు పాడటంలో లతా మంగేష్కర్, ఆశా, రఫీ... ఇంకా ఎందరెందరో అభిమానుల మనస్సుల్లో స్థిరపడిపోయారు. ఓ మంచి పుస్తకంలో ఆదాబ్ హైదరాబాద్ ఏక్ నజర్ చార్ సౌ షహర్ గురించి తెలియ జేశారు. మనం పట్టణాల్లో తిరుణాళ్లు జరిగేటప్పుడు వెళ్లి సినీ ప్రముఖుల బొమ్మలతో ఫొటోలు దిగి సంతోషిస్తాం. ఈ వారం మైనపు బొమ్మల మ్యూజియం చదివితే మేమూ వాళ్లతో ఫొటోలు దిగినంత అనుభూతిని పొందాం. తమాషా కారులో షికారులో రకరకాల కార్లు చాలా బాగున్నాయి. పిల్లలు కూడా చూసి ఆనందించారు. ఈ వారం స్నేహకి అభినందనలు.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్ కాలనీ, విజయనగరం.

'ఆరోగ్యం'లో చక్కగా వివరించారు

ఆరోగ్య శీర్షిక "ఆ పరీక్ష తప్పనిసరి"లో వృద్ధాప్యంలో తప్పని సరిగా చాలా ఎక్కువ మంది బాధపడే ఆస్టియోపోరోసిస్ గురించి, ఆహార జాగ్రత్తలు గురించి మంచి వివరణ ఇచ్చారు. ఈ పరీక్ష ఈ మధ్యనే అందుబాటులోకి వచ్చినా ఎవరూ శ్రద్ధ వహించడంలేదు. బోన్ డెన్సిటీ టెస్టు ప్రస్తుతం కొన్ని హాస్పటల్స్‌లోనూ, ఎగ్జిబిషన్లలోనూ ఫ్రీగా చేస్తున్నారు. చాలా తక్కువ మంది దీనివల్ల లాభం పొందుతున్నారు. దీని వల్ల ఎముకల బలహీనతలను గురించి దాన్ని నియంత్రణలో ఉంచే మందుల గురించి కూడా తెలియ జేస్తున్నారు (అవసరమైన వారికి). ముసలితనం వచ్చిన వారే కాకుండా మధ్య వయస్సువారు కూడా ఫ్రీగా చేసే ఈ పరీక్షను చేయించుకుంటే మంచిది. అవసరమైతే డాక్టరు సలహాలు పొందితే తప్ప వృద్ధాప్యంలో వచ్చే ఈ వ్యాధి బారిన పడకుండా బతకవచ్చు.

మురళీధర్, విజయవాడ.

కవర్ స్టోరీ బాగుంది

నోరూరించే రంజాన్ రుచులు కవర్ స్టోరీ బాగుంది. రుచులు మాత్రమే కాదు, రంజాన్ ప్రాముఖ్యత కూడా తెలుసుకున్నాం. ఇది పేదా, ధనిక అని తేడా లేకుండా అందరూ జరుపునే పండుగ. రంజాన్ మాసంలో ఫిత్రా, జకాత్ వల్ల బీదవారికి ధనవంతులు ఆర్థిక సాయం చేస్తారని తెలియజేసినందుకు ఆనందంగా ఉంది. ఇలా అన్ని మతాల వాళ్లకు ఆహ్వానం పలికి స్నేహాన్ని పెంపొందిస్తుంది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ఆకట్టుకున్న 'టుసాడ్స్' విశేషాలు

డాక్టర్ కె.ఇక్బాల్‌గారు యువత తన సొంత తెలివితేటలతో సరైన వ్యక్తుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని, వైద్యంలో మార్పు రావాలని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వాలు వైద్యవిధానంలో సేవలందించడంలో విఫలమయ్యాయని చెప్పిన తీరు బాగుంది. మేడమ్ టుస్సాడ్స్ మైనపు బొమ్మల మ్యూజియం లండన్‌లో ఉందని, దీనిని సామాన్య పరిభాషలో వాక్స్ మ్యూజియం అంటారని, దీనిని చేరుకోవాలంటే ట్యూబ్ మార్గం (భూగర్భ రైలు) ద్వారా, సిటీ బస్సుల ద్వారా సులభంగా ఇక్కడికి చేరుకోవచ్చు అంటూ మైనపు బొమ్మల మ్యూజియం గురించి చాలా చక్కగా వివరించారు. ఇక్కడ సినీ నటుల బొమ్మలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వారి మైనపు బొమ్మలు నిజంగా నన్నెంతో ఆకట్టుకున్నాయి. ఇంకా రాజకీయ నాయకుల బొమ్మలు, శాస్త్రవేత్తల బొమ్మలు, అక్కడ ఉన్నాయని చెప్పిన తీరు బాగుంది. ఇంత విపులంగా మాతో ముచ్చటించిన ఎస్. వినయ కుమార్ గారికి నా ప్రత్యేక నమస్సులు. నోరూరించే రంజాన్ రుచులు నిజంగానే చవులూరించాయి. ముఖచిత్రం బాగుంది. రోజా, షీర్ ఖుర్మా ప్రత్యేకత ఆసక్తికరంగా ఉన్నాయి. కుటీర పరిశ్రమలు మొఘలుల కాలంలో ప్రవేశించాయంటూ చక్కటి వివరాలు అందించారు. ఆరోగ్యంలో 'ఆ పరీక్ష



తప్పని సరి' అంటూ ఆస్టియోపోరోసిస్ గురించి, అసలు ఆపరీక్ష ఎందుకు చేస్తారు, ఎలా చేస్తారు కారణాలు ఏమిటీ అన్న అంశాలతో కూడిన విలువైన సమాచారాన్ని మాతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కృష్ణాజిల్లా.

చవులూరించిన రంజాన్ రుచులు

సెప్టెంబర్ చివరి ఆదివారం స్నేహ సంచికలో అట్టమీది కథగా.. నోరూరించే రంజాన్ రుచులు...రచన చవులూరింప చేసింది. తమాషా కారు షికారు దృశ్యాలు కనువిందు చేశాయి. సాహిల్ కథ 'బహుమతి' బావుంది. చూద్దామాలో వినయకుమార్ అందించిన మైనపు బొమ్మల మ్యూజియం సంగతులు అబ్బుర పరచాయి. సినిమా కబుర్లులో రంగుల ప్రపంచంలో రూమర్స్ ఓ భాగమే నంటున్న మమతామోహన్ దాస్ అభిప్రాయం అంగీకరించదగినదే. బాల నేస్తాలులో పెన్ స్టాండ్ తయారీ చదివి ఆనందించాం. ఆరోగ్యం శీర్షిక ఎంతో ప్రయోజనాత్మకంగా వుంటోంది. హైదరాబాద్ విశేషాలు తెలుసుకోగోరే వారు 'ఆదాబ్ హైదరాబాద్' చదివి తీరాల్సిందే. విజ్ఞాన వీచికలో లోటస్ ఎఫెక్ట్ గురించి అవగాహన కలిగింది. తమ నైపుణ్యానికి పదును పెట్టి, ప్రతి ఒక్కరికీ వైద్యం అందేలా కృషి చేయాలని పేర్కొన్న మన అతిథి డాక్టర్॥ ఇక్బాల్ గారి మాటలు అక్షర లక్షలు చేసేవే.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళంటౌన్.

*

గ్వాలియర్ కుచేలుడు

ప్రపంచ జనాభా పెరిగిపోతోంది నానాటికీ. ఈ విషయంలో చైనా అన్ని దేశాల్లోకి ముందుంటే మన దేశం దాని తర్వాతి స్థానంతో సరి పుచ్చుకున్నా... ఇవాళో రేపో ఫస్ట్ ప్లేస్‌లోకి వెళ్లి పోయినా చూస్తుండాల్సిందే నని కంగారు పడుతున్నారు కొందరు. అందుకే మన ప్రభుత్వం కూడా 'ఒక్కరు ముద్దు. ఇద్దరు హద్దు' అంటోంది. కానీ ఇవేవీ తెలిసినట్టు లేదు మధ్యప్రదేశ్‌కి చెందిన లక్ష్మణ్ సింగ్ అనే పెద్దమనిషికి. ఈయనగారిది గ్వాలియర్‌లోని లక్ష్మణ్‌పూర్ గ్రామం. అసలు ప్రత్యేకత ఏంటో చెప్పకుండా ఈ సోదేంటనుకుంటున్నారా! అక్కడికే వస్తున్నాం బాస్. ఈయనది కుచేల సంతానం. ఒక్కసారి గెస్ చేయండి ఈయనకు ఎందరు పిల్లలో. మీరు చెప్పినవన్నీ హుష్ కాకీ. ఆయనకు సరిగ్గా 22 మంది పిల్లలు. అందరిలోకీ చిన్నవాడి వయసు రెండున్నరేళ్లు. కాకపోతే ఈ పెద్దమనిషికి పిల్లల పేర్లు గుర్తుపెట్టుకోవడమే కాస్త కష్టంగా వుందంట. సరే ఈ విషయమై ఆయన సతీమణి దక్కో బాయి ఏమంటారంటే..."ఇందరు పిల్లలున్నందుకు సంతోషంగానే వున్నా...వారికి తిండి పెట్టడమే కాస్త కష్టంగా వుంది. ఏదో రొట్టెలు, పాలుతో వారిని పోషిస్తున్నాం" అని. పిల్లలకు చదువు చెప్పించే స్థోమతు లేనికారణంగా ఏదో తనకొచ్చిన నాలుగు అక్షరాలూ వారికి నేర్పుతున్నాడు లక్ష్మణ్ సింగ్. ప్రభుత్వం సాయం చేస్తే బాగుంటుందని ఆయనగారి కోరిక. ఇదంతా చదువుతుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోడమనే సామెత గుర్తొస్తోందా!

కోతి కాదహె

ఇదిగో ఈ బొమ్మలో కనిపిస్తోందే...అది ఏ జంతువో కాసింత చెప్పండి చూద్దాం. ఏందది...మళ్లీ బోలండి. ఏందీ...కోతా! కాదహె! మళ్లీ చూసి చెప్పండి. ఏందీ...మొహం కోతిలాగా...కాళ్లు పందివిలాగా వున్నాయా! ఇప్పుడు తీగమీదకొచ్చారు. అదేనండీ లైన్లోకి. ఈ కనిపించే జంతువు పంది. కాకపోతే పాపం ఎందువల్లచేతనో ఇలా కోతిలా పెద్ద కళ్లు, పల్చటి పెదాలు...చిన్న ముక్కు వచ్చాయి. కాళ్లు కూడా ముందరి కాళ్లకంటే వెనక కాళ్లు పొడవుగా వున్నాయి. దాంతో అది మామూలుగా నడవలేక గెంతుతోంది. ఈ విచిత్ర వరాహాన్ని చూసినోళ్లు మాత్రం భయపడిచస్తున్నారంట. ఇంతకీ ఇది ఎక్కడ పుట్టిందంటే...చైనాలో. అయితే చుట్టు పక్కల వాళ్లు మాత్రం "ఎందుకంత బయపడిసస్తారు. ఎదిగాక పోలికలు మారతాయేమో సూద్దాం. తొందరేటి!" అంటున్నారంట. మనమూ చూద్దాం ఏంపోయింది!

కార్ రిక్షా

-కె.చరిత

మీరు బోలెడన్ని రకాల రిక్షాలను చూసుంటారు. గూడు రిక్షా, చెక్క రిక్షా, బల్ల రిక్షా...ఇలా. కానీ కార్ రిక్షా చూసి వుండరు. అవునా! ఏంటీ ఇలా మొదలెట్టామో లేదో అలా బుర్ర గోక్కుంటూ ఆలోచిస్తున్నారు. 'కార్ రిక్షా ఏంటండీ బాబూ?' అనా! అదేనండీ మరి స్పెషాలిటీ అంటే. ఇంతకీ ఈ కార్ రిక్షా ఎక్కడిదంటారు! చైనాలో వుంది. చెన్ డె బావో కంపెనీ దీన్ని తయారుచేసింది. సర్లేగానీ దీన్ని చూస్తుంటే ఏమనిపిస్తోంది. రెండు చక్రాల కారు బాడీకి రిక్షా తగిలించినట్టుంది కదూ. కారులో ...సారీ... రిక్షాలో కూర్చున్న వారి క్షేమం కోసం సేఫ్టీ బెల్టులు కూడా వున్నాయండోయ్. పైగా దీనిపైన బంగారు రంగులో మెరిసిపోయే డ్రాగన్ల బొమ్మలను కూడా అలంకరించారు. ఏమైనా ఓసారి 'రిమ్‌జిమ్ రిమ్‌జిమ్ రిక్షావాలా...' అని పాడుకుంటూ కార్ రిక్షాలో ప్రయాణం చేయాలనిపిస్తోందా!

అహా మా పెళ్లంట...

పెళ్లి అనగానే దర్జాగా కూర్చున్న పెళ్లికొడుకు...సిగ్గుపడే పెళ్లికూతురు... మేళతాళాలు గుర్తొస్తాయి.కానీ వానలు పడకపోతే కొన్ని పెళ్లిళ్లు చేస్తుంటారు. అదేనండీ కప్పల పెళ్లిళ్లు. ఎంచక్కా రెండు కప్పలను అలంకరించి వివాహం చేసేస్తారు. ఇంకా రావిచెట్టుకీ వేపచెట్టుకీ కూడా పెళ్లి చేయడం చూస్తుంటాం. కానీ ఇటీవల చైనాలోని ఝెజియాంగ్ రాష్ట్రంలోని ఒక జూలో రెండు తమాషా వివాహాలు జరిగాయి. ఉకాంగ్ అనే ఏడేళ్ల కోతికి, జియోయా అనే ఆరేళ్ల కోతితో పెళ్లి చేశారు గ్రాండ్‌గా. అంతేకాదండోయ్ పనిలో పనిగా రెండు ఎలుగుబంట్లకు కూడా పెళ్లి కానిచ్చేశారు. ఇంతకీ ఇదంతా ఎందుకు చేశారో చెప్తే ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది. సందర్శకులను ఆకర్షించడం కోసమే ఈ పెళ్లిళ్లు...పేరంటాలు.



ఖాట్మండు

నేపాల్‌లో ఖాట్మండు తర్వాత అంతపెద్ద నగరం బీర్‌గంజి. దీనినే నేపాల్ ముఖద్వారం అని కూడా అంటారు. ఇక్కడ గండకి నది ప్రవహిస్తుంది. దీనిని అక్కడి వాళ్లు 'నారాయణి' అంటారు. బీర్‌గంజి దాటిన తర్వాత 'హేటంగా' అనే పారిశ్రామిక వాడ వుంది. త్రిభువన్ హార్టికల్చరల్ యూనివర్శిటీ కూడా ఇక్కడే ఉంది. చంద్రగిరి పర్వతశ్రేణిలోని నిటారైన కొండలను, రోడ్డు పక్కనున్న అగాధమైన లోయలను చూస్తే ఎవ్వరికైనా కళ్లు తిరుగుతాయి. 4200 అడుగుల ఖాట్మండు లోయ చల్లగా ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడున్న మెయిన్ రోడ్డును జుధాసరక్ అంటారు.

తుండిఖేల్ దాటిన తర్వాత పేరేడ్‌గ్రౌండ్ వస్తుంది. ఇది దాదాపు ఖాట్మండు నగరమంతా ఉంది. దీనికి దగ్గరగా ఉన్న చౌరస్తాలోని రెజిమెంటులో విక్టోరియా క్రాస్ అందుకున్న వీరులకు స్మారక చిహ్నం ఉంది.

సింగ్ దర్బార్

పేరేడ్‌గ్రౌండ్ మార్గంలోనే కొంచెం ముందుకెళ్తే సింగ్‌దర్బార్ అనే అతి పెద్దకట్టడమైన ప్రభుత్వ అధికార పీఠం ఉంది. దీనిలోనే ఒక పక్కన పెద్ద స్టేడియం, మరోపక్కన నేపాల్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ఉన్నాయి.

దర్బార్ స్క్వేర్

సింగ్‌దర్బార్ నుండి రెండవ వైపుకు వెళ్తే ఖాట్మండు నగరంలోని అతి ప్రాచీన కట్టడ సముదాయమైన దర్బార్ స్క్వేర్ ఉంది. ఈ మందిరానికి ఒక పక్కగా బేస్‌మెంట్‌పై చెక్కతో నిర్మించిన మూడు అంతస్థులు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఇదే ఒకప్పటి రాజ ప్రాసాదం. ఈ మందిరంలో చక్కని శిల్ప సంపదతో కూడిన కళారూపాలు ఉన్నాయి. ఇది హనుమాన్ ధోకాకు చేరిఉండటం వల్ల దీన్ని హనుమాన్ ధోకా దర్బార్ అని కూడా అంటారు.

హనుమాన్ ధోకా

పెద్ద రాతిపెళ్లమీద మలిచిన హనుమంతుని విగ్రహానికి సింధూరం పూసి ఉంటుంది. ఈ హనుమంతుని విగ్రహానికి వెండి, బంగారు ఆభరణాలు అలంకరించి కన్నులపండుగగా ఉంటుంది. ఇది రాజకుటుంబీకుల అర్చనామందిరం.

సేటో భైరవ

హనుమాన్ ధోకా వైపునే గ్రిల్స్ బిగించబడి ఉన్న సేటో భైరవ విగ్రహముంది. భయంకరంగా ఉన్న ఈ విగ్రహానికి ఇంకా భయంకరమైన రంగులు అద్దారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో జరిగే ఇంద్రజాతరనాడు మాత్రమే ఈ గ్రిల్స్‌లాంటి తలుపులు తెరుస్తారు.

మల్ల విగ్రహం

20 అడుగుల ఎత్తైన స్థూపం పైన, ఇక్కడి నిర్మాణాలన్నీ నిర్మించిన మల్లరాజు విగ్రహం ఉంది. ఇది అశోకుని శిలా ధ్వజాన్ని పోలి ఉంటుంది. ఆరోజుల్లో రాజ దర్బారు ఈ ప్రదేశంలోనే జరిగేదట.

కుమారి ఘర్

దర్బార్ స్క్వేర్ నుంచి కొద్ది దూరంలో కుమారి ఘర్ అనే రెండంతస్తుల మండువా లోగిలి ఉంది. దీనిలోని కిటికీలకూ, స్థంబాలకూ ఎంతో సుందరంగా, సున్నితంగా చెక్కిన నగిషీలు ఉన్నాయి. ఈ మందిరానికొక కథ కూడా ఉంది. శాక్య వంశంలో జన్మించిన, విశిష్టమైన ముఖవర్చస్సు, హుందాగా ఉండే నాలుగైదు సంవత్సరాల బాలికను కుమారిగా ఎంపిక చేసి, ఆమెను ఈ మందిరంలో ఉంచుతారు. ఆమే రాజవంశపు కులదేవత అవుతుంది. నగరంలో జరిగే ముఖ్య కార్యకలాపాలన్నీ ఆమె ఆశీర్వాదం లేకుండా జరుగవు. చివరికి మహారాజు సైతం ఆమె ఆశీర్వాదం కొరకు వస్తాడు. ఈ కుమారికి 11,12 సంవత్సరాలు వచ్చాక, మరో నాలుగైదు సంవత్సరాల బాలికకు ఈ బాధ్యతలన్నీ అప్పగిస్తారు. ఈ బాధ్యతలు నిర్వహించినన్ని రోజులు ఆ బాలిక తన తల్లిదండ్రులకు దూరంగా కుమారి ఘర్‌లో ఉండవలసిందే.





కాలభైరవ

అక్కణ్ణుండి కొంచెం ముందుకెళ్తే 12 అడుగుల ఎత్తులో నల్లరాతితో చేసిన అతి భయంకరమైన కాలభైరవ విగ్రహముంది. మెడలో పుర్రెల దండతో, ఆరుచేతులతో ఉంటుందీ విగ్రహం.

మచ్ఛీంద్రనాథ్

మరికొద్ది దూరంలో నేపాలీ ప్రజల నాయకుడైన మచ్ఛీంద్రనాథుని ఆలయముంది. తెల్లని వస్త్రాలంకరణతో ఉన్న పాలరాతి విగ్రహం చూడముచ్చటగా ఉంది.

రాజభవనం

న్యూసిటీలో పాత రాజభవనానికి దగ్గరలోనే కొత్తగా కట్టిన రాజభవనం ఉంది. అతిపెద్ద ప్రవేశ ద్వారంతో, ద్వారానికిరువైపులా నల్లరాతితో మలచిన ద్వారపాలకులతో మనోహరంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో రోడ్డైనా, షాపులైనా రాజసం ఉట్టిపడుతున్నట్లుంటాయి. వివిధ దేశాల దౌత్య కార్యాలయాలన్నీ ఉక్కడే ఉన్నాయి.

బాలాజీ నీటి వనం

నాగార్జున కొండకు దిగువున ఉందీ బాలాజీ నీటివనం. దీనిలో వాటర్ ఫౌంటెన్లకు ఇరువైపులా ఆకుపచ్చ రంగు చేపలతో పెద్ద కొలనులున్నాయి. ఈ నీటివనాన్ని జయప్రకాష్ మల్ల అనే రాజు నిర్మించాడంటారు.

స్వయంభూనాథ్

200 అడుగుల ఎత్తున్న కొండపై నిర్మించిన కట్టడమిది. ప్రపంచంలో ఇప్పటికీ ఉన్నవాటిలోకెల్లా అతి పురాతనమైన కట్టడమిదేనని, రెండువేల సంవత్సరాలకు పూర్వం నిర్మించిందని చెపుతారు. కొండ ప్రారంభంలో మెట్లవద్ద మూడు బుద్ధ విగ్రహాలున్నాయి. కొండమీద మహాయాన బౌద్ధులకు అతి పవిత్రమైన పురాతన స్థూపం 50 అడుగుల ఎత్తున ఉంది. ఈ స్థూపానికి నాలుగు వైపులా రెండుకళ్లూ, ముక్కూ ఉన్నాయి. ఇవి సృష్టిలో జరిగే ప్రతి విషయాన్ని గమనిస్తున్న భగవంతుని నేత్రాలని చెప్పుకుంటారు. ఈ స్థూపం చుట్టూ 5 బుద్ధ విగ్రహాలుంటాయి.

పశుపతి నాథ్

మనకు కాశీ ఎలాగో నేపాలీలకు పశుపతి నాథ్ అలాగే. పశుపతి నాథుని ఆలయం రెండంతస్థులతో పై కప్పు మొత్తం బంగారు పూతతో ధగధగ మెరిసిపోతుంది. ముఖద్వారం వద్ద హిందువులకు మాత్రమే ప్రవేశం అని ఉంటుంది. లోపలికెళ్లగానే బంగారు పూత పూసిన పెద్ద పరిమాణంలో ఉన్న నందీశ్వరుడు, త్రిశూలం కనిపిస్తాయి. మరో పక్క సింధూరంతో ఉన్న హనుమంతుని విగ్రహం ఉంది.

గర్భగుడి నాలుగువైపులా ద్వారాలతో బంగారు పూతతో నగిషీలు చెక్కబడి ఉంటుంది. లోపల 3.5 అడుగుల ఎత్తులో నిత్యాభిషేకాలతో శోభాయమానంగా శివలింగం ఉంటుంది. ఇక్కడ శివరాత్రి రోజున వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి.

ఇక్కడ భాగమతి నది రెండు పర్వతాల మధ్య ప్రవహిస్తుంది. ఈ రెండు పర్వతాలలో ఒక దానిని మృగస్థలి అంటారు. శివుడు ఈ అరణ్యంలో లేడి రూపంలో దర్శనమిచ్చాడనీ, అందుకే దీనికి ఆ పేరు వచ్చిందని చెప్పుకుంటారు. ఇక రెండవ పర్వతం పేరు కైలాసం. ఇక్కడే పశుపతి నాథ ఆలయముంది. అతి పవిత్రమైన తీర్థం కనుక భాగమతి తీరాన అనేక స్నానఘట్టాలున్నాయి. ఈ స్నానఘట్టాలన్నింటికంటే ముఖ్యమైనది ఆర్యఘాట్. నేపాల్ వంశీయులు మరణిస్తే ఇక్కడే అంత్యక్రియలు చేస్తారు.

బోధనాథ్

జ్ఞానానికి అధిపతి అయిన బోధనాథ్ స్వయం భూనాథ్‌కు ఉత్తరంగా ఉంది. ఇది స్వయంభూనాథ్ కంటే పెద్దది, పురాతనమైనదీ కూడా. కానీ అలంకరణ పెద్దగా లేదు. దీని బాధ్యతలన్నీ ఒక చైనా లామా నిర్వహిస్తుంటాడు. రాజా మానదేవుడు ఈ స్థూపాన్ని నిర్మించాడు.

బుఢ్రా నీలకంఠ్

నీలకంఠుడంటే శివుడు. కానీ ఇక్కడ మహావిష్ణువు పెద్ద కొలనులో శేషశయనం మీద వెల్లకిలా పడుకుని ఉన్నట్లుగా ఉంటుందీ ఆచ్ఛాదనలేని మూలవిరాట్టు విగ్రహం.

దక్షిణ కాళి

ఖాట్మండుకు 22కిలోమీటర్ల దూరంలో పాక్‌పింగ్‌కు దిగువున ఉంది. ఇక్కడ ఆలయమేమీ

లేదుకానీ, నల్లరాతిలో మలచిన దేవీ విగ్రహం, కాపలాగా రెండు ఇత్తడి సింహాలు ఉన్నాయి. ఇక్కడ మేకలను, కోళ్లను బలిస్తుంటారు.

శేషనారాయణ్

దక్షిణ కాళి నుంచి ఖాట్మండుకు వచ్చే దారిలో ఉందీ శేషనారాయణ్. లోపల చిన్న నారాయణుని విగ్రహం, పక్కనే బౌద్ధారామం ఉన్నాయి. *

కథ

ఎర్రబడ్డ పల్లె

-అనిల్ కుమార్ అవ్వారు

అప్పుడర్థమైంది వారికి తెల్లబట్టలాయన చెప్పింది ఏమిటో....మట్టి వాసన లేని బతుకులంటే తాము చస్తే కప్పెట్టేందుకు మట్టే లేకుండా చేయడమన్నమాట...గుడ్డి లాంతరు బతుకుల్లో నియాన్ వెలుగులు అంటే ప్రకృతిని... అదిచ్చే ప్రశాంతతని దూరం చేయడమన్నమాట...భవిష్యత్తు బాగుండడమంటే తమను పుడమి పొత్తిళ్ల నుంచి కుప్పతొట్టిలోకి విసిరి వేయడమన్నమాట... నిలిచేందుకు నేలై... బువ్వ ఇచ్చి... బతుకిచ్చి... చివరకు చస్తే తన గుండెల్లోనే ఇంత చోటిచ్చే నా భూమాతను నా నుంచి వేరి చేస్తారా..??? పల్లె వాసి గుండె రగిలింది. ఆవేదన కాస్తా ఆందోళనగా అది ఆవేశంగా... ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంది. అడుగు అడుగు పడింది. పిడికిలి బిగిసింది.

పచ్చటి పల్లె లేలేత నారింజ వర్ణంతో మెరిసిపోతోంది. తూరుపు కొండల ఎత్తు పల్లాల మధ్య నుంచి మబ్బు తెరలను చీల్చుకుంటూ బైటికి వస్తున్న ఉదయభానుని ప్రకాశవంతమైన రూపం...పుడమిని తడిమేందుకు ఉబలాటపడుతూ సూటిగా దూసుకొస్తున్న కిరణాలు... అవి పరుస్తున్న సప్తవర్ణ శోభితాలు... సూర్య భగవానునికి తలలు వంచి స్వాగతం పలుకుతున్న వరిచేలు... కీచురాళ్ల రొదల స్థానంలో పక్షుల కిలకిలా రావాలు... అంతా ఆహ్లాదం... ఆనందం... అప్పటి వరకూ కురిసిన మంచు చల్లదనం... పచ్చిక బయళ్ల పచ్చదనం... ముసురుకున్న చీకట్లు ముఖం చాటేసే సమయం... వెన్నెల వెలుగులు దూరమై తెల్లని కాంతులు పరుచుకుంటున్న వేళ...

ఒక్కొక్కరే అడుగు బైట పెడుతున్నారు. కొన్ని గంటల నిశ్శబ్దానికి భంగం కలిగిస్తూ చిరు సవ్వడులు శబ్దాలుగా మారుతున్నాయి.

"ఏమే యాదమ్మా... బుడ్డోడిని లేపసే... వీధికి పాలు తీసుకెళ్లమను. మళ్లీ యిస్కూలుకు పోయే యాళయిద్ది. నేనట్టా కుమ్మరి వెంకన్న దాక పోయొస్తా.." గొల్లల వీధిలో భార్యకు భర్త సూచన.

"ఒసేయ్ లచ్చిమీ లేవే! బండదానా లేలే..!! సూరీడొచ్చి శానాసేపయింది. లేచి ఆ పేడకళ్లెత్తి... పాక చిమ్మవే. ఆ సుబ్బిగాడిని కూడా లేపవే.." రైతు ఇంటిలో తల్లి అదలింపు.

"వెంకటేశ్వరమ్మా తొందరగా తెమలవే... జాము గడిచిపోతుంది. బట్టలు చూత్తే మోపెడున్నాయి ఇప్పుడెల్తెగాని సందేళకి ఇయ్ మొత్తం ఉతకలేం. తొందరగా తెములు రా..రా.." సాకలి ఈరయ్యలో ఆతృత. ఇలా పల్లెంతా ఎవరి పనుల్లో వారు... అంతా సందడి సందడి...ఓ జాము గడిచిపోయింది. ఉదయభానుడు కాస్తా ప్రచండ భానుడైపోతున్నాడు. ఇప్పటిదాకా వెచ్చదనాన్ని పంచిన లేలేత కిరణాలు కొంచెం ముదిరి సురుక్కు... సురుక్కుమని గుచ్చుతున్నాయి.

"ఏమే మల్లి చంకన సంచేసుకుని, బుడ్డోడిని తీసుకుని చదివేసి దేశాలేలేద్దామనే...' బడికెళుతున్న మల్లిని చూసి తన ఇంటి ముందు అరుగు మీద కూర్చుని చుట్ట కాలుస్తున్న రెడ్డిగారి పెద్దయ్య వెటకారం.

"చదువూ సందెలు మనకెందుకే... మట్టి తల్లిని నమ్ముకోండే... మనల్ని చల్లగా చూస్తుందే...' తన మాటలు విని కూడా విననట్లే వెళ్లిపోతున్న మల్లినే చూస్తూ రెట్టించాడు పెద్దయ్య. మరో జాము గడిచింది... పల్లె వీధులన్నీ లేచిన దుమ్ముతో నిండిపోయాయి. పశువులన్నీ మేతకోసం దారిపట్టాయి. మాకు రోజూ తెలిసిన దారేగా అన్నట్లు మేకలు, గొర్రెలు క్రమం తప్పని సైనికుల్లా ముందుకెళుతున్నాయి. పిల్లలంతా ఊరిలోని పంచాయతీ ఆఫీసు పక్కనే ఉన్న బడిదారి పట్టారు. రైతులంతా పశువులను తోలుకుని నాగలి పట్టి పొలం బయల్దేరిపోయారు. కమ్మరి... కుమ్మరి... గీత.. వడ్రంగి.. చాకలి ఎవరి పనుల్లో వారు ఇమిడి పోతున్నారు. దీనంతటి మూలంగా లేచిందే పల్లెను కమ్మిన ఆ దుమ్ము.

ఆరోగ్యకరమైన ఆ దుమ్ములో జీవం ఉంది. మనసును మైమరిపించే మట్టి వాసన ఉంది. ఆ దుమ్మే ఆ పల్లెలో జీవం నింపుతోంది. ఆ మట్టి సువాసనే ఆ పల్లెవాసుల ఆహ్లాదానికి కారణమవుతోంది. ఆ శ్రమైక జీవన సౌందర్యమే ఆ పల్లెను పచ్చగా ఉంచుతోంది.

ఉన్నట్టుండి ఓ రోజున...ఆ పల్లె లేచిన దుమ్ముతో ఎర్రబడింది. వీధులకిరువైపులా ఉన్న ఇళ్లన్నీ రేగిన దుమ్ముతో ఉక్కిరిబిక్కిరయ్యాయి. కీ... కీ... కూ.. కీక్... కూ.. చెవులు చిల్లులు పడేలా రొద చేసుకుంటూ రయ్‌రయ్‌మంటూ... బిలబిల దూసుకొచ్చేస్తున్నాయి పెద్దపెద్ద కార్లు నాలుగైదు. అన్నీ వరుసగా వెళ్లి ఊరి నడిబొడ్డున ఉన్న పంచాయతీ ఆఫీసు దగ్గర ఆగాయి. ఎప్పుడో ఓట్ల పండుగ వచ్చే ముందు తప్పించి ఇటుకేసి రాని కార్లు ఒక్కసారిగా ఊరిని చుట్టుముట్టడంతో నోరెళ్లబెట్టిన జనం అవి ఆగిన దగ్గరకు ఉరికురికి వెళ్లారు. పరుగున రావడంతో వచ్చిన ఆయాసం... కార్లు రేపిన దుమ్ము గొంతులోకి పోవడంతో వారి గుండెలన్నీ ఒక్కసారిగా మండి... తెరలు తెరలుగా దగ్గు కమ్ముకొచ్చింది వారందరికీ.

అప్పుడు తెలియదు వారెవ్వరికీ ఆ గొంతు మంటే తమ గుండె మంటగా మారుతుందని... ఇప్పుడు వచ్చిన కార్లలోని వ్యక్తులే అందుకు నాందీ వాచకం పలకబోతున్నారని... ఆగిన కారుల్లోంచి దర్జాగా దిగిన కొందరు బాబులు అప్పటికే అక్కడ వేసిన కుర్చీల్లో కూర్చున్నారు. తెల్లగా... లావుగా... నలగని తెల్లని ఖద్దరు బట్టలతో మిలమిల మెరిసిపోతూ కారులోంచి దిగిన పెద్దాయన అక్కడున్న ఓ నలుగురిని పేరుపేరునా పలకరించేసరికి నోరెళ్లబెట్టడం వారి వంతైంది. తమను ఎంతో పరిచయం ఉన్నవాడిలా పేర్లు పెట్టి పిలవడంతో ఎవరా అని తేరిపార చూశారు.

'ఆ గుర్తుకొచ్చింది...! అప్పుడెప్పుడో ఎలచ్చన్లప్పుడు వచ్చి ఎక్కిన గడపా... దిగిన గడపా కాళ్లరిగేలా తిరిగి... గడ్డాలు... చేతులు... కాళ్లు పట్టుకుని తమ ఓట్లు పట్టుకెళ్లినాయనే కదూ...!!

ఇన్నాళ్లకు గుర్తుకొచ్చామన్నమాట' మనసులోనే అనుకుని తలాడించారు ఆ నలుగురూ బాగానే ఉన్నామన్నట్టు.

'గొంతు'లోంచి వస్తున్న
మాటలతో...పెదవులపై తెచ్చిపెట్టుకున్న
నవ్వుతో... కళ్లలో లేని మెరుపుల్ని చూపిస్తూ...
కొద్దిసేపు ఊరి బాగోగుల గురించి... ఊర్లోని
వారి యోగక్షేమాల గురించి...
విరామమివ్వకుండా... అడిగిన వాటికి
సమాధానం కోసం ఎదురు చూడకుండా...
ప్రశ్నలు వేసేసి తన పని కొంత
అయిందనిపించాడు ఆ తెల్లబట్టలాయన.

'కొంపదీసి మళ్లీ ఎలచ్చన్లు గాని రావడం లేదు కదా..?' అన్నట్టు క్వశ్చన్‌మార్క్ ముఖం పెట్టారు పల్లెవాసులు.

మళ్లీ ఆయనే అందుకుని "సరేనన్రా అసలు విషయానికి వస్తాను. మీరందరికీ బాగుపడే రోజులొచ్చాయి. మన ఊరికీ మంచి రోజులొచ్చాయి. ఇక నుంచి మీరంతా ఆ మట్టి బతుకులు బతకాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకూ మీరు పడిన కష్టం చాలు. మీరూ పట్టణాల్లో మాదిరి అందరిలాగా గౌరవంగా బతకాలని మన ప్రభుత్వం అనుకుంటోంది. అందుకే ఈ బండ బతుకుల నుంచి మీకు విముక్తి కల్పించాలని అనుకున్నాం. ఎన్నాళ్లు చేస్తారు వ్యవసాయం. పంటలేసేందుకు విత్తనాలు దొరక్కా... ఆనక ఎరువులు చిక్కకా... సాగుకు నీళ్లలేక... చచ్చి చెడి పండించిన పంటకు గిట్టుబాటు రాక.... ఎందుకీ దండగమారి బతుకులు... దేనికీ రాని వ్యగసాయం..." అని అలుపు తీర్చుకునేందుకు ఆగి అందరిని ఓసారి తేరిపార చూసాడు.

"అవును నిజమే వ్యవసాయం... ప్చ్! అందరికీ అన్నం పెట్టే అన్నదాతలం మేమేనంటారు. అదేమి చిత్రమో చివరికి ఎవరికీ కాకుండా పోతున్నాయి మా బతుకులు" అనుకుంటూ యధాలాపంగా తలలు పంకించారు జనం.

జనం సాలోచనగా... శ్రద్ధగా ఆలకిస్తున్నట్టు కనిపించడంతో రెచ్చిపోయాడా 'పెద్ద'మనిషి...

"...అందుకోసమే.. మీ అందరి కోసమే... మీ జీవితాలను మార్చేందుకే.... మీ గుడ్డి లాంతరు బతుకుల్లో నియాన్‌లైట్ల వెలుగులు నింపేందుకే... ప్రభుత్వం ఓ ఆలోచన చేసింది. మీ పల్లెతో పాటు చుట్టుపక్కలున్న గ్రామాలన్నింటిని కలిపి ప్రత్యేక ఆర్థిక మండలిగా ఏర్పాటు చేస్తాం. అందువల్ల ఇక్కడ అనేక కంపెనీలు వస్తాయి. వాటిలో మీకు ఉద్యోగాలూ ఇస్తారు. ఇంకేముంది ఈ ప్రాంతమంతా అభివృద్ధితో వెలిగిపోతుంది. మీ జీవితాలే మారిపోతాయి. పిల్లలకు చదువుసంధ్యలు చేరువవుతాయి. ఈ మట్టితో ఇక మీరు మట్టికొట్టుకు పోవాల్సిన పనిలేదు. మట్టివాసన లేకుండా మీరూ దర్జాగా బతికేయొచ్చు. అయితే కంపెనీలు పెట్టేందుకు మీ నుంచి కొంత భూమి తీసుకుంటాం. మీకు పరిహారం ఇచ్చే తీసుకుంటాంలే. అర్థమయిందిగా..? ఏమంటారు..?? ఆ... ఏమంటారులే...! మీ బతుకుల్లో... పిల్లల భవిష్యత్తు బాగుంటుందంటే కాదంటారా...!! ప్రభుత్వం మీకో మంచి అవకాశం కల్పించింది. ఇంకేముంది మీ బతుకుల్లో పున్నమి వెలుగులు పూస్తాయిలే" అంటూ తన ప్రశ్నలకు తానే సమాధానం చెప్పుకుని ఉపన్యాసం ముగించేశాడా 'పెద్ద'మనిషి.

తిరిగివచ్చి కుర్చీలో కూలబడి ప్రత్యేకంగా తెప్పించుకున్న నీళ్ల బాటిల్ ఎత్తి గటగటా తాగేశాడు.

ఆయన ఏం చెప్పాడా అని మళ్లీ మననం చేసుకునేందుకు ప్రయత్నించారా పల్లెవాసులు.

'మట్టి బతుకులు.. వెలుగులు... ప్రభుత్వం... పిల్లల భవిష్యత్తు' అంతా గందరగోళంగా ఉండడంతో తలలు విదిలించారు. కానీ వారికి కళ్లముందు ఏమీ స్పష్టంగా కనిపించలేదు. రేగిన దుమ్ములో దూరంగా వెళ్లిపోతూ అస్పష్టంగా కనిపించాయి అంతకుముందొచ్చిన కార్లు. వారికంతా అయోమయంగా ఉంది. అదేంటి తమకేం సంబంధం లేకుండా... వచ్చారు.. చెప్పారు... వెళ్లారు... ఏమిటిదంతా అని ఆలోచిస్తూనే ఇంటి ముఖం పట్టారు. కొంతమంది మాత్రం తెల్లబట్టలాయన చెప్పినదానిపైనే చర్చలు ప్రారంభించారు.

ఇది జరిగిన ఏడెనిమిది వారాల తర్వాత ఓ ఉదయం...

అప్పుడే తెల్లతెల్లగా తెలవారుతోంది. పల్లెలో ప్రకృతి ఆహ్లాదంగానే ఉంది. కానీ పంచాయతీ ఆఫీసు దగ్గరా... మల్లేశంగాడి టీ కొట్టు దగ్గరా... నలుగురైదుగురు చేరి ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కొద్దిసేపటికి వారి ఆసక్తి కాస్తా ఆలోచనగా... చివరకు ఆవేదనగా మారింది. క్షణాల్లో ఒకరు... ఇద్దరు... నలుగురు.... నలభైమంది... ఇలా అది ఊరంతా వ్యాపించింది. అప్పటిదాకా ఉన్న ఆహ్లాదం ఆవిరైపోయింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అక్కడే కాదు... చుట్టుపక్కలున్న అన్ని పల్లెల్లోనూ ఇదే పరిస్థితి.

"....పల్లెతోపాటు చుట్టుపక్కలున్న తీర ప్రాంత గ్రామాల్లోని ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఈ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లోని వ్యవసాయ, వ్యవసాయేతర భూమి ఓ 25 వేల ఎకరాలు ప్రభుత్వం సేకరిస్తుంది. అందుకు అనుగుణంగా ఈ ప్రాంతాన్నంతటిని అసైన్డ్ చట్టం కిందకు తీసుకు వస్తున్నారు" ఇదీ ఆ రోజు ప్రధాన పత్రికల్లో వచ్చిన వార్తా సారాంశం. ఇదే ఆ పల్లెవాసుల్లో ఆందోళన రేకెత్తించిన అంశం.

తొలుత వారెవ్వరికీ అది అర్థం కాలేదు. ఒకటికి రెండుసార్లు ఆ వార్తను తరచి తరచి చూసిన తర్వాతగాని బోధపడలేదు తమ భూములను ప్రభుత్వం లాక్కుంటుందని...

ఆదేరోజు సాయంత్రానికి ప్రతిపక్షపార్టీకి చెందిన నాయకులు ఊళ్లోకి వచ్చారు. వారు చెప్పింది విన్న తర్వాత అర్థమైంది పల్లెవాసులకు తాము పుట్టిన మట్టి నుంచి తమను వేరు చేస్తున్నారని....

ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీల నేతలు గ్రామంలోకి వచ్చారు. వారు చెప్పింది విన్న తర్వాత తెలిసొచ్చింది... పదోపరకో చేతిలో పెట్టి... కన్నతల్లిలాంటి పుడమి తల్లి నుంచి తమను దూరంగా నెట్టేస్తున్నారని... నమ్మించి నట్టేట్లో ముంచేస్తున్నారని... తామంతా వంచనకు గురవుతున్నామని....

రెండు రోజులు గడిచింది. పచ్చని పల్లెలో చిచ్చు రేగింది. దారెంట వెళుతుంటే వంగి సలాం చేస్తూ స్వాగతం పలికే పచ్చటి వరిచేలుపై రియల్ బ్రోకర్ వంకర చూపు పడింది.

గ్రామంలోని ఎర్రమట్టి రోడ్లపైన విదేశీ కార్ల రొద మొదలైంది. ప్రశాంతమైన పల్లెలో అశాంతి ప్రారంభమైంది.

అప్పుడర్థమైంది వారికి తెల్లబట్టలాయన చెప్పింది ఏమిటో....మట్టి వాసన లేని బతుకులంటే తాము చస్తే కప్పెట్టేందుకు మట్టే లేకుండా చేయడమన్నమాట...గుడ్డి లాంతరు బతుకుల్లో నియాన్ వెలుగులు అంటే ప్రకృతిని... అదిచ్చే ప్రశాంతతని దూరం చేయడమన్నమాట...భవిష్యత్తు బాగుండడమంటే తమను పుడమి పొత్తిళ్ల నుంచి కుప్పతొట్టిలోకి విసిరి వేయడమన్నమాట... నిలిచేందుకు నేలై... బువ్వ ఇచ్చి... బతుకిచ్చి... చివరకు చస్తే తన గుండెల్లోనే ఇంత చోటిచ్చే నా భూమాతను నా నుంచి వేరి చేస్తారా..??? పల్లె వాసి గుండె రగిలింది. ఆవేదన కాస్తా ఆందోళనగా అది ఆవేశంగా... ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంది. అడుగు అడుగు పడింది. పిడికిలి బిగిసింది. తరతమ... కుల-వర్గ.... పేద-పెద్ద... జెండా-పార్టీ.... భేదం లేకుండా ఓ పెద్ద సమూహం ముందుకు కదిలింది. ఇప్పుడు ఆ పచ్చటి పల్లెలన్నీ ఎర్రబడ్డాయి... పల్లెవాసుల రక్తం ఆగ్రహంతో సలసలా కాగిపోతుంది. నాగలి పట్టాల్సిన రైతు... వల విసరాల్సిన జాలరి... కమ్మరి... కుమ్మరి.... మంగలి... దర్జీ... గొర్రెల కాపరి... చాకలి... నేత... గీత... ఇలా సమస్త జనం ఒకే దారి పట్టారు...

"పనులు లేకపోనీ... పస్తులుంటాం... ప్రాణాలైనా అర్పిస్తాం... పుట్టినప్పటి నుంచి చచ్చేదాక కాదు.. కాదు... చచ్చిన తర్వాత కూడా కడుపులో పెట్టుకుంటున్న మా భూమి తల్లిని మాత్రం వీడిపోబోం" అంటూ అంతా పోరు బాట పట్టారు.

పొద్దున్నే పశువులు మాత్రం వాటికి తెలిసిన దారివెంటే మేతకు వెళుతున్నాయి. వాటిని తోలుకెళ్లాల్సిన బుడ్డోడు మాత్రం నేను సైతం అంటూ అమ్మ... అయ్య వెంట ఆ ఆందోళనలో కలిశాడు.

ఇప్పుడు ఆ పల్లెల్లో పక్షుల కిలకిలా రావాలు లేవు. కీచురాళ్ల రొదలు లేవు. ప్రకృతి పరవశం లేదు.

అంతా ఆవేశం... ఆగ్రహం... అంతటా... అన్ని వేళలా...

'మా మట్టి వాసనలో విషం చిమ్మొద్దు... ఆ మట్టి బతుకులే మాకు ముద్దు'

'ప్రకృతిని మింగేసే యంత్ర భూతాలొద్దు.... మా పచ్చటి చేలను చిదమొద్దు'

'అభివృద్ధి అంటూ మా బతుకులు ఆగమాగం చేయొద్దు' అన్న నినాదాలు హోరెత్తుతున్నాయి. వారందరిలో ఒకటే కసి... తమ ఓట్లతో గద్దెనెక్కి తమనే ముంచాలని చూస్తున్న వాడి అంతం చూడాల్సిందే... ఆ కసితోనే పచ్చగుండాల్సిన పల్లె ఎర్రబడింది.

*

విజ్ఞాన వీచిక

- డా॥ కాకర్లమూడి విజయ్



చందమామపై తొలి అడుగు



అంతరిక్షంలో మన ఆనవాళ్లు తక్కువేమీ కాదు. మనవి కనీసం 16 ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరుగుతూ టెలీకమ్యూనికేషన్లు, టెలీప్రసారాలు, వాతావరణ పరిశోధనలు వంటి వాటికి సహకరిస్తున్నాయి. ఇస్రోకి ప్రతిష్ఠాత్మకంగా మారిన చంద్రయాన్1 విజయాన్ని బట్టి 2014లో అంతరిక్షంలోకి మానవుణ్ణి పంపాలని, ఆ తరువాత 2020లో చంద్రుడి పైకి మానవుణ్ణి పంపాలనీ ప్రణాళిక ఉంది.

అమెరికా వాళ్ళు చందమామపై కాలుమోపారంటే అదో విశేషమే గానీ, భారతీయులమైన మనం ఎప్పుడు అక్కడికి వెళ్తామా అన్న ఆసక్తి మాత్రం మనకీ వుంది. ఈ ఆసక్తిని వాస్తవంగా మార్చేరోజు చాలా దగ్గరలోనే వుందనేది మరో వాస్తవం. మనదేశంలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఈ నెలలోనే చంద్రుడిపై మానవరహిత ప్రోబ్‌ని దించడానికి సన్నద్ధంగా ఉంది. చంద్రయాన్1 గా పిలువబడే ఈ యాత్ర చంద్రమండలాలపై ఖనిజాలను గుర్తించే కార్యక్రమం సాగిస్తుంది. నిజానికి ఈ చంద్రమండల యాత్ర గత ఏప్రిల్‌లోనే జరగవలసి ఉంది. కానీ సాంకేతిక కారణాలవల్ల దానిని అక్టోబర్ 22కి వాయిదా వేయవలసి వచ్చింది.

ఈ తొలి చంద్రమండల యాత్ర ద్వారా రకరకాల ఖనిజాలు, మూలకాలను గుర్తించడం, మొత్తం చంద్రుడి ఉపరితలాన్ని 3డి రూపంలో చిత్రీకరించడం ముఖ్యఉద్దేశ్యాలు. ఇస్రో రూపొందించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ - పిఎస్ఎల్వి- చంద్రయాన్1 ని 240 కి.మీ×24,000కిమీ సుదీర్ఘ వృత్తంలో పరిభ్రమింప చేస్తుంది (అంటే భూమికి అతి దగ్గరగా ఉన్నప్పుడు 240 కి.మీ, అతి దూరంగా ఉన్నప్పుడు 24,000కి.మీ). ఆ తరువాత చంద్రయన్ స్వశక్తిపై చంద్రుడికి 100 కిమీ దూరాన తిరుగుతూ వుంటుంది. ఈ మొత్తం కార్యక్రమానికి ఖర్చు 80 మిలియన్ డాలర్లు. అంటే దాదాపు నాలుగు బిలియన్ రూపాయలు! చంద్రయాన్ రెండేళ్ల పాటు చురుకుగా ఉంటుంది.

ఇంతవరకు చంద్రుడి పైకి ప్రోబ్‌లను పంపిన ఇతర దేశాలకంటే లోతైన అధ్యయనం చంద్రయాన్1 వల్ల సాధ్యమవుతుంది. ఖనిజాలనే కాక హీలియం, నీరు వంటివి ఉన్నాయేమో పరిశీలించడం కూడా చంద్రయాన్ లక్ష్యాల్లో ఒకటి.

చంద్రయాన్1 యాత్రలో "లూనార్ క్రాఫ్ట్"ని పిఎస్ఎల్వి ద్వారా శ్రీహరి కోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌నుండి ప్రయోగిస్తారు. లూనార్ క్రాఫ్ట్ భూమ్మీద 1304 కిలోల బరువుంటే చంద్రుడి చుట్టూ తిరుగుతున్నప్పుడు 590 కిలోల బరువు తూగుతుంది.

పిఎస్ఎల్వి అక్టోబర్ 15, 1994న ఐఆర్ఎస్-పి2 రిమోట్ సెన్సింగ్ శాటిలైట్‌ని 820 కిమీ దూరాన కక్ష్యలో పెట్టి తొలివిజయాన్ని సాధించింది. ఇప్పటికే అనేక సార్లు రకరకాల అంతరిక్ష పరిశోధక పరికరాల్ని, ఉపగ్రహాల్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన పిఎస్ఎల్వి, చంద్రయాన్ కోసం మెరుగైన సామర్థ్యంతో సిద్ధం కాబోతోంది.

అంతరిక్షంలో మన ఆనవాళ్లు తక్కువేమీ కాదు. మనవి కనీసం 16 ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరుగుతూ టెలీకమ్యూనికేషన్లు, టెలీప్రసారాలు, వాతావరణ పరిశోధనలు వంటి వాటికి సహకరిస్తున్నాయి. ఇస్రోకి ప్రతిష్ఠాత్మకంగా మారిన చంద్రయాన్1 విజయాన్ని బట్టి 2014లో అంతరిక్షంలోకి మానవుణ్ణి పంపాలని, ఆ తరువాత 2020లో చంద్రుడి పైకి మానవుణ్ణి పంపాలనీ ప్రణాళిక ఉంది.

భారతదేశ వైజ్ఞానిక సంసిద్ధత, గత విజయాలు, పట్టుదల గమనిస్తే భారతీయుడు చంద్రుడిపై అడుగుపెట్టడం అసంభవమేమీకాదు. అదే జరిగితే, చందమామని మనం రమ్మని పిలవక్కరలేకుండా మనమే అక్కడికి వస్తున్నామని చెప్పొచ్చు.

*

బాల వికాసం

-పీపీ

"తల్లిదండ్రులు ఎంత ఎక్కువగా అదుపాజ్ఞలు విధించేట్టయితే అంతగా పిల్లలు కొన్ని అలవాట్లకు లోబడిపోతారు. అమ్మానాన్నలతో మామూలు అనుబంధం గల పిల్లల్లో హాబీలు మృదువుగా వుంటాయి. ఇలాంటి వారికి ఇంట్లో వారి నుంచి పూర్తి సహకారం కూడా లభిస్తుంటుంది. ఇందుకు భిన్నంగా నియంత్రితమైన నిఘా వాతావరణంలో పెరిగిన పిల్లల హాబీలు మరీ కరుడుగట్టి పోతాయి. వారు వాటిని ఏ పరిస్థితుల్లోనూ వదులుకోలేరు"

అమ్మానాన్నల అతిశ్రద్ధ పసిపిల్లలకు గుదిబండ

విషయం ఏదైనా సరే పరిమితి మించితే ప్రయోజనాల కన్నా ప్రమాదాలే ఎక్కువవుతాయి. ఇది అమ్మా నాన్నల అతి ప్రేమకూ వర్తిస్తుందంటున్నారు పరిశోధకులు. సమకాలీన సమాజంలో పిల్లలపై తల్లిదండ్రుల శ్రద్ధాసక్తులు, వారికి కేటాయించే సమయమూ తక్కువై పోతున్నాయని ఒకవైపున విమర్శలు వున్నాయి. కాని మరోవైపు చూస్తే అహరహం పిల్లలను అంటి పెట్టుకుని వుండే తల్లిదండ్రులు కూడా తప్పు చేస్తున్నట్టేనని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఇలాంటి వాటి వల్ల వారి వ్యక్తిత్వ వికాసానికి విఘాతం కలిగించిన వారవుతారని హెచ్చరిస్తున్నారు.

మీరు మీ పిల్లల పట్ల మరీ ఖచ్చితంగా వుండేట్టయితే వారిలో ఏదో ఒక అలవాటు వదులుకోలేనిదిగా తయారవుతుందట. అది ఒక మానసిక వ్యసనం స్థాయికి చేరుతుందట. మాంట్రియల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు 600 మంది పిల్లలపైనా వారి తల్లిదండ్రులపైన అధ్యయనం జరిపిన తర్వాత ఈ నిర్ధారణలకు వచ్చారు. వీటిని వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన 'జర్నల్ ఆఫ్ పర్సనాలిటీ' అనే పత్రికలో ప్రచురించారు. తల్లిదండ్రుల ఒత్తిడి మరీ ఎక్కువైన పిల్లలు దాన్ని అధిగమించేందుకు ఏవేవో అలవాట్లను పెంచుకుంటారు. ఇక వీరికి అవే సర్వస్వమై పోతాయి. ఆఖరకు తమ చదువు, పని, కుటుంబం, స్నేహితుల కన్నా ఈ మానసిక వ్యసనాలే ప్రధానమై పోతాయి.

"తల్లిదండ్రులు ఎంత ఎక్కువగా అదుపాజ్ఞలు విధించేట్టయితే అంతగా పిల్లలు కొన్ని అలవాట్లకు లోబడిపోతారు. అమ్మానాన్నలతో మామూలు అనుబంధం గల పిల్లల్లో హాబీలు మృదువుగా వుంటాయి. ఇలాంటి వారికి ఇంట్లో వారి నుంచి పూర్తి సహకారం కూడా లభిస్తుంటుంది. ఇందుకు భిన్నంగా నియంత్రితమైన నిఘా వాతావరణంలో పెరిగిన పిల్లల హాబీలు మరీ కరుడుగట్టి పోతాయి. వారు వాటిని ఏ పరిస్థితుల్లోనూ వదులుకోలేరు" అని ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన జీన్‌వైవ్ మాగ్ చెప్పారు. అలాగే తల్లిదండ్రుల బలవంతం వల్ల ఏదైనా నేర్చుకోవలసి వచ్చిన పిల్లలు తద్వారా వారి మెప్పు పొందవచ్చుననుకుంటారు. ఇతర పిల్లలు ఈ అలవాట్లద్వారా తల్లిదండ్రుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చుననుకుంటారు. ఇక్కడ అది అటూ ఇటుగా తిరగబడుతుంది. ఇక్కడ తమ హాబీ ద్వారా అమ్మానాన్నలను అలరించడమే ప్రధానమై పోతుంది. సమస్య ఏమంటే వీరు పెద్ద వారైన తర్వాత కూడా ఇతరులను మెప్పించడం కోసం ఏదో ఒకటి చేయడమే తమ గౌరవానికి మార్గంగా అనుకుంటారు" అని ఆ పరిశోధకులు చెబుతున్నారు. సైన్సు ప్రయోగాలు, డాన్సు, సంగీతం, ఈత, స్కైయింగు ఇలా అన్ని హాబీలలోనూ ఈ ప్రభావాలను వారు పరిశీలించారు. అతిగా పట్టించుకునే వారి పిల్లలు ఈ హాబీలను మనో వ్యసనాలుగా మార్చేసుకుంటారని తేల్చారు.

ఇంతకు ముందు కూడా అతి శ్రద్ధ కనపరిచే తలిదండ్రులపై పరిశోధనలు జరక్కపోలేదు. తమ పిల్లల బాగోగుల గురించి తెలుసుకోవడానికి అదే పనిగా విద్యాలయాల చుట్టూ పరిభ్రమించే వారిపై మేనేజిమెంట్లు ఇప్పటికే తీవ్రంగా స్పందించాయి. వారి నుంచి అలా ప్రవర్తించబోమని కాగితం రాయించుకున్నాయి. ఈ తలిదండ్రులకే "హెలికాప్టర్ పేరెంట్స్" అని నామకరణం చేశారు. హెలికాప్టర్ ఆకాశంలో చక్కర్లు కొట్టినట్టు వీరు స్కూలు చుట్టూ తిరుగుతుంటారని ఇక్కడ భావన. వీరు ఇంతగా వెంటబడటం వల్ల జరిగే మేలు లేకపోగా వారు స్కూలును, టీచర్లను శత్రువులుగా చూపడానికి కారకులవుతున్నారనేది విమర్శ. ఈ విషయంలో విద్యావేత్తలు, ఉపాధ్యాయులు చాలా ఆందోళన చెందుతున్నారట. ఈ సమస్య అంతకంతకూ తీవ్రమవుతున్నట్టు చెబుతున్నారు. వీరి వల్ల టీచర్లపైన నిర్వాహకుల పైన మానసిక వత్తిడి పెరుగుతుంది. వారు చెప్పగలిగింది చెబుతుంటారు. కాని తల్లిదండ్రులు పదే పదే పాఠశాలకు వచ్చి చెప్పే టీచర్ల, వినే పిల్లల శక్తికి మించి ఫలితాలు రాలేదని ఆగ్రహించడంతో వాతావరణం పాడై పోతున్నదనే వ్యాఖ్యలు ఎక్కువగా వినవస్తున్నాయి.

అమ్మానాన్నలు ఎవరికైనా తమ పిల్లలు బాగా చదువుకోవాలని సకల కళా పారంగతులు కావాలని వుండటం సహజం. అయితే ఆ ఆతృత ఎక్కువైతే మేలు కన్నా కీడు ఎక్కువనేది ఈ పరిశోధనలో మరోసారి వెల్లడైన పరమసత్యం. ✻

'చిన్నప్పుడు సినిమాలు బాగా చూసేవాణ్ణి... సినిమాలంటే పిచ్చి... సినిమాలే లోకం...' ఇలాంటి మాటలు చాలా మంది చెబుతుంటారు. కానీ ఇందులో సక్సెస్ అయ్యేవాళ్ళు మాత్రం కొందరే. సినిమారంగంలో ఏదో సాధించాలన్న పట్టుదలతో ప్రవేశించి తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటివారిలో నల్లమలపు శ్రీనివాసరావు అలియాస్ బుజ్జి ఒకరు. 'లక్ష్మి', 'లక్ష్యం' 'చింతకాయల రవి' చిత్రాలు నిర్మించిన బుజ్జితో బాతాఖానీ...

అది నా ఆలోచనే...

మీ గురించి చెప్పండి?

మాది గుంటూరు. కమీషన్ ఏజెంట్‌గా పత్తి వ్యాపారం చేశాను. చిన్నప్పటి నుంచీ సినిమాలు బాగా చూసేవాణ్ణి. నిర్మాత బెల్లంకొండ సురేష్ మా మామయ్య. దీంతో సినిమా పరిశ్రమతో అనుబంధం ఏర్పడింది. 'సాంబయ్య', 'మా అన్నయ్య', 'చెప్పాలని ఉంది' చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఉపేంద్ర హీరోగా 'రా' అనే చిత్రంతో నిర్మాతగా మారాను. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా 'ఆది' మంచి గుర్తింపు తెచ్చింది. అనంతరం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గానే 'చెన్నకేశవరెడ్డి', 'కళ్యాణరాముడు' చిత్రాలకు పని చేశాను. ఆ తర్వాత సొంతంగా శ్రీ లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్ స్థాపించి తొలి ప్రయత్నంగా 'లక్ష్మి', ఆపై 'లక్ష్యం', చింతకాయల రవి' తీశాను.

తొలి చిత్రం నిర్మించే అవకాశం ఎలా వచ్చింది?

దర్శకుడు వి.వి. వినాయక్‌తో వెంకటేష్ ఓ చిత్రం చేయాలనుకున్నారు. అదీ సోలో నిర్మాతతో. అలా దర్శకుని కోరిక మేరకు ప్రొడ్యూసర్‌గా మారాను.

మరి 'లక్ష్యం'...

'రణం' చిత్రంలో గోపీచంద్ పెర్‌ఫార్మెన్స్ చూసి ఆయనతో ఓ చిత్రం తీయాలనుకున్నాను. ఆ సమయంలో 'లక్ష్యం' చిత్ర దర్శకుడు శ్రీనివాస్ ఓ కథ చెప్పాడు. అందులో మెయిన్ పాయింట్ తీసుకుని కథను మార్చి తీశాం. కథ గురించి మూడో వ్యక్తి అభిప్రాయం తీసుకుందామని సురేష్‌బాబు దగ్గరికి వెళ్లాను. ఇద్దరం కలిసి నిర్మిద్దామన్నారు. దీంతో సంయుక్తంగా తీశాం.

'చింతకాయల రవి'...

చిత్ర కథకుడు, మాటల రచయిత కోన వెంకట్ నాలుగు సంవత్సరాల క్రితం ఓ కథ చెప్పాడు. సురేష్‌బాబుకు వినిపిస్తే... వెంకటేష్‌కు చెప్పమన్నారు. హైదరాబాద్, విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో కథ చెబితే... అమెరికా, విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో కథ సిద్ధం చేయమని సలహా ఇచ్చారు.

అన్నీ మాస్ చిత్రాలే తీశారు. మాస్ పల్స్‌ను ఎలా పట్టుకున్నారు?

నేనూ, వినాయక్ రూమ్‌మేట్స్. డాలీ, దొంగ గోపి.. మరికొందరు కలిసి కథా చర్చలు పెట్టేవారు. కథల ఎంపికలో ఆ చర్చ నాకు బాగా ఉపయోగపడింది. కథ విన్న వెంటనే బాగుందో, లేదో ఇట్టే చెప్పే అనుభవం వచ్చింది. నిర్మాతగా కథలో వంద శాతం ఇన్వాల్వ్ అవుతాను. సినిమా హిట్ అయినా... ఫ్లాప్ అయినా బాధ్యత నాపైనే వేసుకుంటాగానీ, ఇంకొకరిని నిందించను.

మరి 'రా'లో మీ జడ్జిమెంట్ తప్పింది కదా!

అది మినిమం గ్యారెంటీ సినిమాగా నిలిచింది. ఆ సమయంలో అవగాహన లేకపోవడంతో బిజినెస్ సరిగా చేయలేకపోయాను.

మాస్ చిత్రాలు తీసే మీరు 'చింతకాయల రవి'తో క్లాస్ ప్రొడ్యూసర్ అయ్యారు. మాస్‌కీ, క్లాస్‌కీ తేడా ఏం గమనించారు?

మాస్ చిత్రాల రీల్స్ చకచకా కదిలిపోతాయి. కానీ 'చింతకాయల రవి' ముక్కోణపు ప్రేమకథా చిత్రం. సినిమా ఆద్యంతం ఆసక్తిగా సాగుతుంది. లక్ష్మి గారు అద్భుతమైన సెంటిమెంట్ పండించారు. ఫైట్స్ లేకపోయినా ప్రేక్షకులకు నచ్చింది.

ఓ పాటలో ఎన్.టి.ఆర్ కన్పించడానికి ప్రత్యేక కారణం ఏమైనా ఉందా?

అది నా ఆలోచనే. దర్శకుడు, సురేష్‌బాబు, వెంకటేష్‌బాబును సంప్రదించాక ఎన్.టి.ఆర్‌ను అడిగాను. ఇంకో మాట మాట్లాడకుండా వెంటనే చేస్తానన్నారు. ఇందులో పెద్దగా లాజిక్ లేదు. రాజశేఖర్ కొరియోగ్రఫీ చేశారు.

తదుపరి చిత్రం 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం' ఎంతవరకు వచ్చింది?

'చింతకాయల రవి'లా ఇది కూడా రొమాంటిక్ ఎంటర్‌టైనర్. డాలీ (కిషోర్ పార్థసారథి) దర్శకునిగా పరిచయమవుతున్నారు. వినాయక్‌ను ఎలా నమ్మానో డాలీపై కూడా అంతే విశ్వాసం ఉంది. సిద్దార్థ, తమన్నా నాయకానాయికలు. హీరో తల్లిదండ్రులుగా ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ నటిస్తున్నారు. 65 శాతం షూటింగ్ పూర్తయింది. బొమ్మరిల్లు ఫేం విజయ్ చక్రవర్తి కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి నాడు చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం.

తదుపరి ప్రాజెక్ట్స్...

ఎన్.టి.ఆర్‌తో సినిమా ఉంటుంది. 'చింతకాయల రవి'ని కన్నడలో పునీత్ రాజ్‌కుమార్‌తో రీమేక్ చేయనున్నాం.

తొలి రెండు వారాల టిక్కెట్ రేట్లను పెంచుకునే అవకాశాన్ని రద్దు చేయడంపై మీ స్పందన..

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే టిక్కెట్ రేట్లు మనకే తక్కువ. బీహార్‌లో కూడా 60 రూపాయలుంది. సినిమా క్వాలిటీగా రావాలంటే బడ్జెట్ ఎక్కువ అవుతుంది. ప్రస్తుతమున్న టిక్కెట్ రేట్లతో మంచి క్వాలిటీ ఇవ్వలేం. టిక్కెట్ రేట్ల గురించి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారిని కలిసి సమస్యలు విన్నవించాం. ఆయన పాజిటివ్‌గా స్పందించారు.

*

మామిడి కాయతో సెనగపప్పు రొయ్యల కూర

కావలసినవి

రొయ్యలు - 250 గ్రాములు
ఉల్లిపాయ - 1, దాల్చిన చెక్కలు - 4
లవంగాలు - 4 , కారం - రెండు స్పూన్లు
సెనగపప్పు - 100 గ్రాములు
పుల్ల మామిడికాయలు - 2
పచ్చిమిర్చి - 2, ఉప్పు - సరిపడా

సెనగపప్పు నీళ్లలో నానబెట్టాలి. రొయ్యలు ఒలిచి శుభ్రం చేసుకుని కడిగి ఉంచుకోవాలి. మామిడికాయ చెక్కు తీసి ముక్కలు కోసుకుని పెట్టుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోవాలి. దాల్చిన చెక్క, లవంగాలు వేయించి పొడి చేసి పెట్టుకోవాలి. బాండీలో కొంచెం నూనె వేసి కాగనివ్వాలి. తరువాత సెనగపప్పు, ఉల్లిపాయ ముక్కలు వేసి వేగనివ్వాలి. తరువాత రొయ్యలు, ఉప్పు, కారం వేసి మగ్గనివ్వాలి. తర్వాత మామిడికాయ ముక్కలను వేసి ఉడికించుకోవాలి. అవసరమైతే కొంచెం నీరు చేర్చుకోవచ్చు. చివరగా దించే ముందు దాల్చిన చెక్క పొడి వేసి కలపాలి.

ఆలు దోశ

కావలసినవి

ఆలుగడ్డలు - పావు కిలో
పచ్చి మిర్చి - నాలుగు
కొత్తిమీర - చిన్న కట్ట
బియ్యం పిండి - కప్పు
పెరుగు - కప్పు
నూనె - సరిపడినంత
ఉప్పు - సరిపడినంత
తినే సోడా - చిటికెడు

ముందుగా ఆలుగడ్డలను మెత్తగా ఉడికించుకోవాలి. వాటిని మెత్తగా మెదుపు కోవాలి. ఇందులో తరిగిన మిర్చి, కొత్తిమీర, ఉప్పు, పెరుగు, బియ్యం పిండి, వంట సోడా, ఉప్పు వేసి దోసెపిండిలా జారుగా కలుపుకోవాలి. ఒక గంటసేపు పక్కన పెట్టుకోవాలి. పెనం వేడిచేసి చెంచా ఆయిల్ వేయాలి. దోశ వేసినట్లుగా పిండిని వేసుకోవాలి. మరీ పెద్దగా కాకుండా చిన్నగా వేసుకొని దోరగా వేయిస్తే చాలా రుచిగా ఉంటాయి. వేడివేడిగా తింటే అదిరిపోతుంది.

దుంప బూరెలు

కావలసినవి

చిలగడ దుంపలు- అర కిలో
పంచదార - పావు కిలో
మైదా పిండి - పావు కిలో
బియ్యం పిండి - పావు కిలో
యాలుకలు - 10

చిలగడ దుంపలు నీళ్లలో వేసి ఉడకపెట్టాలి. చల్లారిన తర్వాత తొక్కు తీయాలి. మైదా, బియ్యం పిండి కలిపి నానబొయ్యాలి. ఇది పలచగానే కలుపుకోవాలి. చిలగడ దుంపలు మెత్తగా పిసికి అందులో పంచదార, యాలుకల పొడి వేసి ముద్దగా తయారు చేయాలి. చిలగడ దుంపల ముద్దలను పలుచని పిండిలో వేస్తే మునుగుతాయి. వాటి చుట్టూ పిండి పట్టుకుంటుంది. వీటిని కాగే నూనెలో వేసి గోధుమరంగు వచ్చే వరకు వేయించాలి. వీటిని వేడివేడిగా తింటే బావుంటాయి.



కచోడీలు

కావలసినవి

మైదా - 2 కప్పులు, సెనగపిండి - 1 కప్పు
పచ్చిమిర్చి - 10, అల్లం - చిన్న ముక్క
ఉల్లిపాయలు - 2, వెల్లుల్లి - 6 రెబ్బలు
గరం మసాలా - 1 టీ స్పూన్
ఉప్పు - సరిపడా
నిమ్మరసం - సగం ముక్క
పాలు - పావు కప్పు
నెయ్యి - పావు కప్పు

మైదా జల్లించి 2 స్పూన్ల నెయ్యి, పాలు పోసి తగినన్ని నీళ్లు పోసుకుని పూరీ పిండిలా కలుపుకోవాలి. శనగపిండిని బాండీలో వేసి కొద్దిగా నెయ్యి వేసి బాగా ఎర్రగా వేగనిచ్చి దించాలి. మిర్చి, అల్లం, ఉల్లిపాయలు, వెల్లుల్లి దంచి ఉప్పు, మసాలా కలిపి నేతిలో ఈ ముద్దను బాగా వేయించాలి. దీన్ని శెనగపిండిలో వేసి నిమ్మరసం వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మైదాపిండిని చిన్న చిన్న పూరీలుగా వత్తుకోవాలి. ఒక పూరీ మీద ఈ మిశ్రమాన్ని పెట్టి పైన ఇంకో పూరిని కప్పి చుట్టూ నీళ్లతో తడి చేసి అంటించి ఎర్రగా చపాతీలా వేయిస్తే చాలా బావుంటాయి.



కిటికీ ఏది?

చిన్నారులూ! ఈ కారుకు ముందుపైపు ఒక అద్దంలేదు చూశారుగా. కిందేమో మూడు రకాల కిటికీలు ఉన్నాయి. వాటిలో ఏది కరెక్ట్‌గా కారుకు సరిపోతుందో చూసి టిక్కు పెట్టండే.

జవాబు: 1వ నంబరు కిటికీ.

పట్టుకోండి చూద్దాం

ఫ్రెండ్స్! సముద్రంలో ఉండే జంతువుల పేర్లు మీకు తెలుసు కదూ! ఏంటీ మాకామాత్రం తెలీదా అంటున్నారా. మరింకేం... ఇక్కడున్న పజిల్లో మూడు సముద్రపు జంతువుల పేర్లు ఉన్నాయి. అవి అడ్డంగా, నిలువుగా ఎలాగైనా ఉండొచ్చు. మీరు వాటిని వెతికి పట్టుకొని సున్నా చుట్టాలి.



o	j	m	k	l	w	c
j	c	f	c	p	e	r
m	t	t	i	t	u	a
k	c	m	o	s	o	b
l	r	n	t	p	h	k
w	e	e	l	a	u	x
c	l	b	c	h	z	s

[జ॥: crab, octopus, eel.



ఎవరి ఆహారం ఏదబ్బా...

పిల్లలూ ఒక పక్కనేమో జంతువులూ, కీటకాలూ ఉన్నాయి. రెండోవైపునేమో అవి తినే ఆహారం ఉంది. ఇప్పుడు మీరు చేయాల్సిందేంటంటే ఏ జంతువు ఏ ఆహారం తింటుందో చూసి వాటిని జత చేయాలన్నమాట. ఏంటీ అప్పడే మొదలెట్టేశారా.

చుక్కలు కలిపేద్దాం

హాయ్! ఇక్కడున్న చుక్కలన్నీ వరుసగా కలిపేస్తే ఒక చక్కని బొమ్మ తయారవుతుంది. అయితే ఆ బొమ్మకు మంచి రంగులేస్తే ఇంకా బాగుంటుందిగా.



చిన్నారి చిత్రకారులు

ఎస్.హృదయ్ సాయి
6వ తరగతి
సెయింట్ ఆల్ఫాన్సా హై స్కూల్
(ఊరుపేరు రాయలేదు)



ఓ. అనిరుధ్ కృష్ణ
యు.కె.జి
కిడ్జీ స్కూల్
రాంజీ నగర్
నెల్లూరు-2.

ఆ ఒక్కటి ఏదో

నేస్తాలూ... ఇక్కడ నర్సు ఉపయోగించే వస్తువులు ఉన్నాయి చూశారా! బాండేజ్, సిరంజి, టాబ్లెట్లు... ఇంకా చాలా ఉన్నాయిగా. అయితే వాటిలో ఒక్కటి మాత్రం ఆమె ఉపయోగించేది కాదు. అదేమిటో మీరు గుర్తుపట్టి దానికి సున్నా చుట్టండి.

జవాబు: టీ కెటిల్.

లెక్క చేద్దామా!

చిన్నారులూ... మీకు లెక్కలు తెలుసు కదా! కూడికలూ, తీసివేతలు, భాగాహారాలు... అన్నీ బాగా చేస్తారుగా. ఇప్పుడు మీరు కింద ఉన్న పజిల్లోని లెక్కలు చకచకా చేసేయాలి. సరేనా

15	÷	3	=	
−	■	×	■	+
3	−	2	=	
=	■	=	■	=
	−	6	=	6

జవాబు: 15÷3=5, 15-3=12, 3×2=6, 3-2=1, 5+1=6, 12-6=6.

ఎం. కోటేశ్వరరావు



అవనిపై ఆకలి... ఆపసోపాలు

తినటానికి తిండిలేని వారు, అర్థాకలితో కడుపు మాడ్చుకొనే వారెందరో మనకు నిత్యం తారస పడుతుంటారు. తిన్నది అరక్క అవసరం లేని ఊబకాయాలను పెంచుకొని ఆయాసపడే వారిని కూడా మనం ఈ మధ్య కాలంలో ఎక్కువగా చూస్తున్నాం.

ఒక మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ఎంత ఆహారం అవసరం? రోజుకు రెండువేల వంద నుంచి 3,500 కాలరీల శక్తిగల ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆహార నిపుణులు తేల్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జనం గరిష్టంగా 35 వేల కాలరీలనిచ్చే ఆహారాన్ని రోజూ తీసుకుంటున్నారంటే నమ్మకం కలగటం లేదు కదూ !

ఇలా ఎందుకని? అందరికీ సరిపడా ఆహారం లేనందునా లేక ఉన్న ఆహారాన్ని అందరికీ అందచేయలేకపోవటమా? కారణాలేమిటి? ఇదొక సమస్య అయితే ప్రపంచ ఆహార భద్రతకు వస్తున్న ముప్పు గురించి మనం తరచూ వింటున్నాం. పులిమీద పుట్రలా ఈ సమస్య ఏమిటి? ఈనెల 16న ప్రపంచ ఆహార దినం సందర్భంగా ఒక్కసారి దీన్ని గురించి చూద్దాం .

మానవహక్కుల అంతర్జాతీయ ప్రకటనలోని 25 ఆర్టికల్ ప్రకారం ప్రతి మనిషి, అతని కుటుంబానికి అవసరమైన తిండి,బట్ట, గృహవసతి కలిగి ఒక నిర్ణీతప్రమాణాల ప్రకారం జీవించే హక్కు ఉంది. దీన్ని ప్రతినాగరిక సమాజం ఆమోదించి ఐదు దశాబ్దాలు దాటింది. అయినా ప్రతి రోజూ కోట్లాది మంది రోజూ ఆకలితో శాశ్వత నిద్రాదేవి వడికి చేరుతున్నారు. ప్రపంచంలోని జనాభా అంతటికీ అవసరమైన దానికంటే ఎక్కువే ఆహారం ఉన్నప్పటికీ ప్రపంచంలోని 41 దేశాలు ఆకలితో అల్లాడుతున్నాయి. వాటిలో 33 సబ్ సహారా ఆఫ్రికా ప్రాంత దేశాలే ఉన్నాయి. అక్కడి జనాభాలో 19 కోట్ల మంది అర్ధాకలితో బతుకుతున్నారు. పిల్లల్లో 80శాతం మందికి హెచ్ఐవి వైరస్ సోకింది. పెద్దవారిలో 70శాతం మందికి ఎయిడ్స్ ఉంది. నాలుగింట మూడువంతుల ఎయిడ్స్ మృతులు అక్కడే ఉన్న కారణంగా అక్కడి వారి సగటు జీవన ప్రమాణం పది నుంచి 20 సంవత్సరాలు మాత్రమే ఉంది. ప్రపంచ ఆహార సంస్థ 2006 వివరాల ప్రకారం అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల్లో 82 కోట్ల మంది



తలా కొంత భూమి ఇస్తే.....

ఒక మనిషికి ఒక చేపను ఇస్తే ఆరోజుకు కడుపునిండుతుంది. అదే చేపలు పట్టటం నేర్పితే అతనికి ఆకలే ఉండదని ఒక లోకోక్తి. ఇప్పుడున్న స్థితిలో అది మాత్రమే చాలదని వేరే చెప్పనవసరం లేదు. అతనికి చేపలు పట్టటంతో పాటు వ్యవసాయాన్ని కూడా నేర్పితే అతను పదిమందికి ఆహారాన్ని సమకూర్చిన వాడవుతాడు. అందుకు భూమి సమకూర్చటం ముఖ్యం. ప్రపంచంలో నీటి కొరత కారణంగా సాగుచేయలేని భూమితో పాటు వ్యవసాయం చేయని వారి చేతిలో కూడా విస్తారంగా భూమి ఉంది. అలాంటి వారు నిజంగా సమాజానికి ద్రోహం చేస్తున్నారు. వారి నుంచి భూమిని తీసుకొని దున్నేవానికే భూమినిస్తే ప్రపంచానికి ఆహార సమస్య ఉండదు. అనేక దేశాల్లో ఈ విషయం రుజువైంది.

నిరంతరం ఆకలితో ఉంటున్నారు.

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 52 కోట్ల మంది ఉంటే వారిలో ఒక్క మనదేశంలోనే 21 కోట్ల మంది ఉన్నారు. వీరి ముంగిట్లో ఆకలి జబ్బులు సిద్ధం సుమతీ అన్నట్లు కాచుకొని ఉంటాయి.

బక్క ప్రాణులు-భారీ కాయులు

ఇది నాణానికి ఒకవైపైతే మరొకవైపు తిన్నది అరక్క శరీరాలను పెంచేసి సమాజానికి భారంగా మారుతున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రపంచ జనాభాలో వందకోట్ల మంది పరిమితికి మించి బరువున్న పెద్దలున్నారు. వారిలో 30 కోట్ల మంది గుండ్రమ్మలు, గుండ్రయ్యలు. వందకోట్ల 'బడా' శాల్తీలకు తిండి జబ్బులు బోనస్‌గా వస్తున్నాయి. రెండవరకం సుగర్ వ్యాధి, గుండె జబ్బులు, రక్తపోటు, గుండెపోటు, కొన్ని రకాల క్యాన్సర్లు వస్తున్నాయి. కొవ్వు, పంచదార ఎక్కువగా ఉండే తిండి అదేపనిగా తినటం, పనిపాటలకు దూరంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. మనవంటి వర్ధమాన దేశాల్లో బక్కచిక్కిన బడుగు జీవులతో పాటు తమ కాయాన్ని తామే మోయలేని 'బడా' జీవులు పక్కపక్కనే దర్శనమిస్తున్నారు. ధనిక, పేద, వర్ధమాన దేశాలనే తేడా లేకుండా ఈ సమస్య తయారవుతోంది. సమాజానికి ఆకలితో ఉండేవారితో ఎంత నష్టమో తిండి ఎక్కువైన వారితో కూడా అంతే నష్టం. చైనాలో 'బడా'శాల్తీల శాతం అతి తక్కువగా అంటే ఐదుశాతానికి లోపు ఉండగా జపాన్, కొన్ని ఆఫ్రికన్ దేశాలలో 75శాతం మంది ఉన్నారు. అమెరికాలో గత మూడు దశాబ్దాలలో అధిక బరువున్న పిల్లల సంఖ్య రెట్టింపు కాగా పెద్దవారు మూడురెట్లు పెరిగారని వెల్లడైంది.

ఆకలి లేని సమాజం కోసం .....

ప్రపంచ ఆహార సమస్య పరిష్కారానికి రెండవ ప్రపంచ యుద్ధసమయంలో వచ్చిన ఆలోచనల మేరకు 1945లో ప్రపంచ ఆహార సంస్థ(ఎఫ్ఏఓ) ఏర్పడింది. అకలి, అర్ధాకలి, దారిద్ర్యాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత తీవ్రం చేసేందుకు 1979లో జరిగిన ఒక సమావేశం ప్రతి ఏడాది అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినంగా పాటించాలని పిలుపునిచ్చింది. ఐక్యరాజ్యసమితి 2015 నాటికి మిలీనియం అభివృద్ధి లక్ష్యాలుగా నిర్ణయించిన ఎనిమిదింటిలో



దారిద్ర్యం, ఆకలికి సంబంధించి ఒకటి. దానిలో రోజుకు ఒక డాలర్ కంటే(48 రూపాయలు) తక్కువ ఆదాయంతో జీవించే వారిని సగానికి తగ్గించటం ఒకటి. తీవ్ర ఆకలి, దారిద్ర్యంలో మగ్గుతున్నవారి సంఖ్యను సగానికి తగ్గించటం రెండవది.

కడుపు నిండితేనే.....

మానవాళికి అత్యంతపురాతన శత్రువు ఆకలి. దాన్ని జయించేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావటం లేదు. అన్నార్తుల సంఖ్య 1970-97 మధ్య తగ్గిందని ప్రపంచ సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఆతరువాత తిరిగి పెరగటం ప్రారంభం అయింది. ప్రతి వ్యక్తికి కనీసం 2,100 క్యాలరీల శక్తిగల ఆహారం దొరికితే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. అంతకు తగ్గితే శారీరరక, మానసిక కార్యకలాపాలు క్రమంగా తగ్గుతాయి. ఆకలి మెదడును దేనిపైనా కేంద్రీకరించనివ్వదు. శరీరం కూడా అంతే కదలటానికి మొరాయిస్తుంది. ఆకలితో ఉన్న పిల్లలకు ఆడి పాడుకోవాలని, చదువుకోవాలని గానీ అనిపించదు(అందుకే మధ్యాహ్నభోజన కార్యక్రమం). పని చేసే వారికి, గర్భిణులు, పిల్లల తల్లులకు అదనపు ఆహారం అవసరం. తగినంత ఆహారం లేకపోతే శరీరానికి రోగనిరోధకశక్తి తగ్గిపోతుంది. అన్ని రకాల జబ్బులు అంటుకుంటాయి. ఆకలి నష్టాలు ఎలా ఉంటాయి? ఒక బిడ్డ పోషకాహారలేమి కారణంగా శారీరకంగా, మానసికంగా ఎదగకపోతే జీవిత కాలంలో సంపాదించే దానిలో ఐదు నుంచి పదిశాతం నష్టం ఉంటుందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. ఆహార సంస్థ 2004 నివేదిక ప్రకారం బాల్యంలో తగినంత ఆహారం లభించని కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో 34 కోట్ల పని సంవత్సరాల నష్టం ఉంటోంది.

మానవ తప్పిదాలు-ప్రకృతి బీభత్సాలు

ఇరవై వేల సంవత్సరాల క్రితం ప్రపంచమంతా మంచుతో నిండి ఉంది. మంచుయుగంతో పోలిస్తే ఇప్పటికి పెరిగిన ఉష్ణోగ్రత కేవలం పది ఫారన్‌హీట్ డిగ్రీలు మాత్రమే అంటే చాలా మందికి ఆశ్చర్యం కలుగుతుంది. అందువలన ఒకటి రెండు డిగ్రీల మార్పు కూడా ఎంతటి ప్రభావాన్ని కల్పిస్తుందో అర్థం చేసుకోవచ్చు. భూమిపై జీవజాలం, రుతువులు, చెట్టు చేమలు ఇవన్నీ కూడా ఈ మార్పుల పర్యవసానమే. అందుకే పర్యావరణానికి ఏర్పడిన ముప్పు కారణంగా భూమండలం వేడెక్కుతున్నదని, మంచుప్రాంతాలు కరిగిపోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీని ప్రభావం పంటలపై కూడా ఉంటుంది. 2005లో వరదలు, సునామీ, భూకంపాల కారణంగా 14.6 కోట్ల మంది ఇబ్బంది పడ్డారు. ప్రపంచంలో పంటలు పండే భూమిలో కేవలం 17శాతం విస్తీర్ణానికే నీటి సౌకర్యం ఉంది. అయితే మొత్తం ఆహార ఉత్పత్తిలో ఇక్కడ 40శాతం ఉత్పత్తి అవుతోంది. మొత్తం భూమికి నీటి సౌకర్యం కల్పిస్తే ఎంత ఉత్పత్తి చేయవచ్చో అర్థం చేసుకోవచ్చు. సారవంతమైన భూమిని అతిగా సాగుకు వినియోగించిన కారణంగా 15శాతం పనికి రాకుండా పోయింది.

వృధా చేస్తే అంతే

మనం ఉత్పత్తి చేసే ఆహారం మొత్తం సద్వినియోగమౌతోందా అంటే లేదన్నదే సమాధానం. ఆహార వృధాను 2025 నాటికి సగానికి తగ్గించాలని అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు కోరుతున్నాయి. ఈ విషయంలో ధనికదేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి.

అమెరికాలోనూ అన్నార్తులు

రోజురోజుకూ జనాభా విపరీతంగా పెరుగుతోంది కానీ పంటలు పండించటానికి కావాల్సిన భూమి పెరగదు కదా అందుకే ఆహార కొరత ఏర్పడుతోందన్నది చాలామందికి ఉన్న అభిప్రాయం. కొందరు అలా ప్రచారం చేస్తున్నారు కూడా. నిజానికి ఇది పాక్షిక సత్యం మాత్రమే. అమెరికా,రష్యా, జపాన్, ఐరోపాలోని ధనికదేశాల్లో గత కొద్ది సంవత్సరాలుగా జననాల రేటు తగ్గిపోతోంది. ఇదే సమయంలో ప్రపంచమంతటా ఆకలి పెరుగుతోంది. అమెరికాలో ఆహారధాన్యాలకు కొరతలేదు. కానీ అక్కడ కూడా కడుపునిండా తిండిలేని వారెందరో ఉన్నారు. అవసరమైతే ఆహారధాన్యాలను సముద్రాల్లో అయినా పారపోస్తారు తప్ప అక్కడి పేదలకు అందచేయని గొప్ప ప్రజాస్వామిక దేశమది. అమెరికాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య దాదాపు మూడు కోట్ల మంది. (ప్రతి పదకొండుమంది అమెరికన్లలో ఒకరు) నమోదు చేయించుకోని వారు మరో కోటి మంది ఉండవచ్చని అంచనా. ఇక్కడ మనకు కిలో రెండురూపాయల బియ్యం ఇస్తున్నట్లుగానే అక్కడి ప్రభుత్వం వారికి ఆహార కూపన్లు ఇస్తున్నది. కార్మిక కుటుంబాలు గతంలో 30శాతం కూపన్లు పొందగా ఇప్పుడు 41శాతానికి పెరిగింది. ఇప్పుడు అన్ని తరగతుల వారు కూపన్ల కోసం వస్తున్నారని ఏడాదికి 15 నుంచి 20శాతం కూపన్ల డిమాండ్ పెరుగుతోంది. అమెరికా స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తినటం అంటే అవమానంగా భావించే వారున్నారు. ఇప్పుడు పిల్లలు స్కూళ్లలో పెట్టిన భోజనంలో కొంత స్కూల్లో తిని మిగిలినదానిని ఇంటికి తెచ్చుకొని తింటున్నారని వెల్లడైంది. అమెరికాలో ఆహార కూపన్ల పంపిణీ 1964లో ప్రారంభమైంది. అక్కడ సంపదలతో పాటు కూపన్ల కోసం చేతులు చాచే వారి సంఖ్య కూడా నానాటికీ పెరుగుతోంది. మన రాష్ట్రంలో తెల్లకార్డులను నిరాకరించటానికి ఆ కుటుంబానికి ఫ్యానుందా, టీవీ ఉందా, ఇంట్లో బండలు పరుచుకున్నారా అని చూసిన సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకోవచ్చు. అమెరికాలో కూడా ఇలాంటి ఆంక్షలు పెట్టి అనేక మందికి రిపబ్లికన్ పార్టీ ప్రభుత్వం గతంలో కూపన్లు రద్దు చేసింది. కూపన్లు పొందేవారికి ఇల్లు,కార్లు ఉండకూడదని గరిష్టంగా రోజుకు ఒక వ్యక్తికి మూడు డాలర్ల కంటే ఇచ్చేది లేదన్న నిబంధనలు ఉన్నాయి. ఈ విధంగా అమెరికాలో కూపన్లకు కేటాయించిన మొత్తం ఈ ఏడాది 3800 కోట్ల డాలర్లు కాగా వచ్చే ఏడాది 4000 కోట్లకు చేరుతుందని అంచనా.

అమెరికాలో 30శాతం అంటే 483 కోట్ల డాలర్ల విలువగల ఆహార పదార్థాలను వృథాగా పారవేస్తున్నారు. దీని వలన నీరు కూడా వృథా అవుతోంది. కనీసం 40లక్షల కోట్ల లీటర్ల నీరు మురుగులో కలుస్తోంది. ఇది 50 కోట్లమంది నీటి అవసరాలకు సమానం. ప్రపంచంలో 120 కోట్ల మంది జనం తగినంత నీరు లేని ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ పూర్వరంగంలో ఆహార వృథాను అరికట్టటం ఎంత అవసరమో వేరే చెప్పనవసరం లేదు.

ప్రపంచీకరణ పుణ్యాన పెరిగిన ఆకలి

ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు చెప్పేదాని ప్రకారం ప్రపంచీకరణ ఆహార సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఎందుకంటే ఎక్కడ ఆహారం ఎక్కువ ఉంటే తక్కువ ఉన్న ప్రాంతాలకు వాటిని తరలించేందుకు ప్రపంచీకరణ దోహదం చేస్తుందని అవి చెప్పాయి. ధరలు తగ్గుతాయని ఊరించారు. ఆ విధానాలను పక్కాగా అమలు జరుపుతున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఆహారధాన్యాలు పండించిన ఘనత నాదేనని, దేవుడి పాలన అని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఆయనగానీ ఆయన వందిమాగధులుగానీ దేవుడి పాలనలో బియ్యం ధరలు రికార్డు స్థాయిలో ఎందుకు పెరిగాయో చెప్పటం లేదు. సామాన్య జనం అంత ధరలు పెట్టి బియ్యం ఎలా కొనుగోలు చేయగలరో మాట్లాడటం లేదు. మరోవైపు జిఎం విత్తనాలు ఉత్పత్తిని ఇబ్బడి ముబ్బడి చేస్తాయని బహుళజాతి కంపెనీలు ఊదరగొట్టాయి. వాటి ఉత్పత్తి సంగతేమోగాని వాటిని తయారు చేయటంలో అగ్రగామిగా ఉన్న మనకు బాగా తెలిసిన మాన్‌శాంటో కంపెనీ లాభాలు మాత్రం 86శాతం పెరిగాయి. ఇదే సమయంలో ప్రపంచంలో ఆకలీ పెరిగింది. అంటే ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నంత మాత్రాన అకలి తీరదా?

ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ కడుపునిండా తిండి తినటానికి అవసరమైన ఉత్పాదనకు భూమ్మీద కావాల్సిన వనరులు పుష్కలంగా ఉన్నాయి. కావాల్సింది వాటిని అందరికోసం వినియోగించటమే. ఉత్పత్తి అయిన వాటిని సక్రమంగా పంపిణీ చేయకపోతే ప్రయోజనం ఉండదు. పని చేయని భూస్వాముల చేతుల్లో భూములుంటే వాటిలో తొండలు గుడ్లు పెట్టటానికి తప్ప మరొకందుకు పనికిరావు. వాటిని పేదలకు పంచాలి. రైతాంగానికి అవసరమైన ఎరువులు కావాలయ్యా బాబూ అంటే వాటిని సముద్రపు దొంగలెత్తుకెళ్లారని జవాబు చెప్పే వ్యవసాయశాఖా మంత్రులుంటే రైతులకు ఉత్సాహం ఎక్కడుంటుంది. శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేసిన అధికోత్పత్తి, నిల్వ సాంకేతిక పరిజ్ఞానం గుత్త కంపెనీల గుత్త సొమ్ముగా మారకూడదు. కాలేకడుపులు నిండాలంటే నిజమైన జనానికి ప్రాతినిధ్యం వహించే పాలకులు గద్దెనెక్కినపుడే ప్రపంచంలో ఆకలి తీరుతుంది. అలాగాక జార్జి బుష్‌లు, వారి అడుగులకు మడుగులొత్తే ముషరఫ్‌లు, మన్మోహన్‌సింగులు దేశప్రయోజనాలను తాకట్టు పెడుతుంటే ప్రపంచంలో ఆకలి కేకలు రానున్న రోజుల్లో మరింతగా వినిపిస్తాయి.

*

ఆరోగ్యం

డాక్టర్ ఎ.శేఖర్ రెడ్డి,
న్యూరో సైకియాట్రిస్ట్,
ఎక్సన్ హాస్పిటల్స్, అమీర్‌పేట్,
హైదరాబాద్. ఫోన్ 9848051452

ధూమపానం మానడానికి పంచసూత్రాలు

తమాషాగా ఒకసారి అంటూ మొదలెట్టి రింగ్‌స్మోకర్లయినవారెందరో. జేబుకి, ఊపిరితిత్తులకు చిల్లు పెట్టే సిగరెట్‌ను ప్రతి జనవరి ఫస్టుకి మానేయాలని న్ణియించుకోవడం...డిసెంబర్ 31న సిగరెట్ మీద సిగరెట్ కాల్చడం...మళ్లీ యథాప్రకారం జనవరి 2వ తేదీనుంచి దమ్ము కొట్టడం... మామూలే. కానీ ధూమపానం మానేయడం అంత కష్టమేమీ కాదు. అయితే ముందుగా పొగాకు అలవాటుకి దూరంగా ఉండాలనే నిశ్చయానికి రావాల్సింది మీరే. దీనికి ఐదు సూత్రాలున్నాయి. ఈవారం మీకోసం ప్రత్యేకంగా ఆ వివరాలు...

పొగాకులో ఉండే నికోటిన్ అనే పదార్థం వల్ల మనిషి ఈ వ్యసనానికి గురవుతున్నాడు. పొగాకు వాడకాన్ని విరమించుకోవడం అనేది శారీరకంగా, మానసికంగా ఉంటుంది. శరీరానికి నికోటిన్ అందకపోవడంతో ప్రతిచర్య చూపుతుంది. వేదన, చిరాకు, కోపం, చికాకు, నిద్రలో బాధ, ఏకాగ్రతలో ఇబ్బంది, నిర్విరామంగా తలనొప్పి, అలసట, ఆకలి పెరగుతాయి. ఈ అసౌకర్యమైన లక్షణాలు లేని స్థాయిలోకి రక్తంలో నికోటిన్‌ని తిరిగి కలిపేందుకు పొగ తాగేవారిని మళ్లీ పొగతాగేలా ప్రేరేపిస్తాయి.

పంచ సూత్రాలు

కింద చెప్పిన ఐదు సూత్రాలు పాటిస్తే పొగాకు నుండి విముక్తి చెందే అవకాశాలు చాలా ఎక్కువ.

తయారవ్వండి

ఒక తేదీని నిర్ణయించుకుని మీ వాతావరణాన్ని మార్చుకోండి. పొగాకుకు సంబంధించిన వస్తువులన్నీ ఇంట్లో, కారులో, కార్యాలయంలో ఉంటే పారేయండి. ఇంట్లో వేరే ఎవ్వరిని పొగ తాగనివ్వొద్దు. ఇంతకు ముందు మీరు ప్రయత్నించి ఉంటే ఆ సందర్భాలను గుర్తుకు తెచ్చుకోండి. ఏ చిట్కాలు పనిచేశాయో, ఏవి పని చేయలేదో ఆలోచించండి. ఒకసారి మీరు పొగ తాగడం మానేశాక మళ్ళీ ఒక్కసారి కూడా దాన్ని ముట్టుకోవద్దు.

సహాయం, ప్రోత్సాహం

ఇతరుల నుంచి సహాయం పొందినవారు ఎక్కువ శాతం పొగాకుని మానేయగలిగారని పరిశోధనలో వెల్లడైంది. ఇంట్లో వాళ్ళకు, చుట్టాలకు, స్నేహితులకు, సహోద్యోగులకు సిగరెట్ తాగడం మానేస్తున్న విషయం తెలపాలి. వారి నుంచి మీకు సహాయం, ప్రోత్సాహం కావాలని చెప్పండి. మీ చుట్టూ ఎవరూ పొగ తాగవద్దని చెప్పండి.

అలవాట్లు, నడవడిక

పొగ తాగాలన్న తపన కలిగినపుడు మనసును వేరే విషయం వైపు మళ్ళించుకోవాలి, ఎవరితోనైనా మాట్లాడడం, వాకింగ్‌కు వెళ్ళడం చేయాలి. ఏదో ఒక పనిలో మునిగిపోవాలి. మొదటిసారి ప్రయత్నిస్తున్నపుడు మీ దినచర్యను మార్చండి. మీరు వేరే దారిలోకాని, వేరే వాహనంలోకాని ఆఫీస్‌కు వెళ్ళండి. టీ లేదా కాఫీ బదులుగా వేరేది తాగండి. ఒత్తిడిని తగ్గించేందుకు వేడి నీళ్ళతో స్నానం చేయడం, వ్యాయామం చేయడం లేదా ఇష్టమైన పాటలు వినడం లాంటివి. ప్రతిరోజు మీ మనస్సును ఆనందింపచేసే పనులు చేయండి. నీళ్లు ఎక్కువగా తాగండి.

మందులు సరిగా వాడాలి

మందుల వల్ల పొగ తాగాలనే తపన (కార్వింగ్) నుండి విముక్తి పొందొచ్చు. మీ దగ్గరలో ఉన్న పొగాకు విముక్తి కేంద్రాన్ని సంప్రదించండి. మందులు ఎలా వాడాలో సరిగా తెలుసుకోండి. మందులు వాడితే పొగాకు మానేసే అవకాశం రెండింతలు పెరుగుతుంది. పొగాకు మానేయడంతో మందులు ఖచ్చితంగా సహాయపడతాయి.

పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

మీరు సిగరెట్ తాగడం తిరిగి ప్రారంభిస్తే చింతించొద్దు. మానేయడం మొదలు పెట్టిన మూడు నెలలోనే తిరిగి ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తుంచుకోండి. పొగాకు మానేసే వాళ్ళు చాలాసార్లు ప్రయత్నించి చివరికి సాధించినవారే.

కష్టమైన పరిస్థితులు

ఆల్కాహాల్: ఏ విధమైన మద్యపానీయాలు సేవించకండి. ఇది పొగాకు నుండి విముక్తి చెందే అవకాశాలు తగ్గిస్తుంది. పొగతాగేవారి మధ్యలో ఉంటే తిరిగి ప్రారంభించాలనే తపన పెరుగుతుంది. కాబట్టి వారి నుండి దూరంగా ఉండండి.

బరువు పెరగడం : పొగ తాగడం మానేశాక కొంత మంది సుమారుగా నాలుగు కేజీల దాకా బరువు పెరగొచ్చు. సరైన పోషకాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం వల్ల ఈ పెరిగే బరువును అరికట్టొచ్చు. ఇలాంటి పరిస్థితులలో మీ దగ్గరలో ఉన్న పొగాకు విముక్తి కేంద్రాలను సంప్రదించండి.

ఎన్ఆర్‌టి అంటే ?

నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టి) అంటే పొగాకులో ఉండే నికోటిన్‌ని కొన్నాళ్ళు వాడి పొగాకు నుండి విముక్తి పొందడం. ఇవి రెండు రకాలు. గమ్, సాచెస్ వాడడం వల్ల సిగరెట్ తాగాలనే తపన తగ్గుతుంది. కాని వాటిని వాడే ముందు డాక్టర్‌ని సంప్రదించండి.

ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది. ఆఖరికి మీ పట్టుదల, దృఢ సంకల్పం మిమ్మల్ని పొగాకు నుండి విముక్తులను చేస్తుంది. ప్రయత్నిస్తూనే ఉండండి. పట్టు విడవకండి. మీరు ఖచ్చితంగా సాధిస్తారు.పొగ మానేస్తారు.

*

శ్రమ వీరుని అమరగాధ

ఉత్తేజ దాయకమైన రమణి జీవిత గాధను రామకృష్ణన్ చాలా క్లుప్తంగా సూటిగా పొందుపర్చడం అభినందనీయం.సిపిఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ పుస్తకానికి చిన్న 'ముందుమాట' రాస్తూ నిరంతరం ఉద్యమాలతో మమేకమైన ఈ కార్మిక నాయకుడిని గురించి ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడగలదని పేర్కొన్నారు. ఆ దృష్టితోనే ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ తెలుగు అనువాదాన్ని వెలువరించింది. టి.జగన్మోహన్ అనువాదం పఠనీయంగా సాగింది. ఆశయపథంలో ఆటుపోట్లకు అలసిపోని ఆదర్శయోధుల జీవితాలకు ఓ ఉదాహరణగా అవశ్యం చదవాల్సిన జీవిత గాధ ఇది.



కర్మాగారాల్లోంచి వ్యవసాయ క్షేత్రాల్లోంచి కష్టజీవులు కమ్యూనిజంలో దూకుతారు అని రష్యన్ మహాకవి వ్లదీమర్ మయకోవస్కీ అంటాడు. చరిత్ర పర్యావలోకనం చేస్తే కష్టజీవులకు వజ్రాయుధం లాటి సిద్ధాంతం అందించిన వాడు కారల్ మార్క్స్. ఆ సిద్ధాంతాన్ని ఆచరణకు తీసుకురాగలిగిన తీసుకురావలిసిన ప్రధాన శక్తి కార్మిక వర్గం. వారికి తోడుగా పేద మధ్య తరగతి రైతాంగం ఇతర స్వల్పాదాయ వర్గాలు. ఈ పోరాటానికి నాయకత్వ పాత్ర కార్మిక వర్గానిదే. ఆధునిక కాలంలో అదే అత్యంత చైతన్య వంతమైన సమరశీలమైన ప్రభావ పూర్వకమైన వర్గం.కమ్యూనిస్టుపార్టీకి పునాది. కార్మిక వర్గాన్ని ఎంతగా సంఘటిత పర్చి సమరోన్ముఖం చేయగలిగితే అంతగా కమ్యూనిస్టు పార్టీ లక్ష్య సాధన వైపుగా పయనించగలుగుతుంది. అయితే వ్యవసాయ ప్రధానమైన భారత దేశం వంటి చోట్ల కమ్యూనిస్టుపార్టీలోనూ నేరుగా కార్మిక వర్గం నుంచి వచ్చిన ముఖ్య నాయకుల సంఖ్య పరిమితంగానే వుంటుంది. అలాటి కొద్ది మంది కాకలు తీరిన కార్మికవర్గ నేతలలో ప్రముఖుడు కె.రమణి. ఆయన జీవితాన్ని రాజకీయ గమనాన్ని కళ్లకు కడుతూ తమిళనాడు రాష్ట్ర సిపిఎం నాయకుడు ఎన్.రామకృష్ణన్ రచించిన చిన్న పుస్తకం " కామ్రేడ్ కె.రమణి- జీవితం,కృషి" గతంలో బిటిరణదివే, పి.రామమూర్తి తదితరుల జీవిత గాధలను ఇంగ్లీషులో అందించిన రచయిత ఇప్పుడు రమణి ఉత్తేజకర ప్రస్థానాన్ని అక్షరీకరించారు.

దక్షిణ భారతదేశానికి జౌళి మిల్లుల కేంద్రంగా ప్రసిద్ధి కెక్కిన కోయంబత్తూరులో తొలి తరం ట్రేడ్ యూనియన్ నాయకుడు కె.రమణి. మామూలు మిల్లు కార్మికుడుగా బయలుదేరి రాష్ట్రంలోనే కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేతగా ఎదిగాడు. శాసనసభ్యుడుగా పార్లమెంటు సభ్యుడుగా అఖిలభారత నాయకుడుగా ఎనలేని సేవలందించారు.ఏకకాలంలో ఉద్యమాన్ని నిర్మాణం, స్వీయాభివృద్ధి రెంటినీ సాధించిన రమణి జీవితంలో ముఖ్య ఘట్టాలను ఈ పుస్తకం మన ముందుంచుతుంది.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మలబార్ ప్రాంతంలో ఇదప్పల్ గ్రామంలో 1916 జులై 16న రమణి జన్మించాడు. తల్లి చిన్నప్పుడే బాధ్యతలు వదిలేసి ద్వితీయ వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో తల్లి అష్టకష్టాలు పడి వారిని పోషించవలసి వచ్చింది. ఐదో తరగతితో చదువు ఆపేసి ఆయన కూడా రోజుకు అయిదు పైసల కూలికి పనికి కుదిరాడు. అమ్మ,అమ్మమ్మ,చెల్లెలు కూడా భూస్వాముల ఇళ్లలో చాకిరీ చేస్తుండేవారు. అప్పుడే కోయంబత్తూరు వలస వెళ్లారు. రమణి చెల్లెలిని పెళ్లి చేసుకున్న కృష్ణ కురూప్ బావమరిదికి ఆయన కుటుంబ సభ్యులకు కూడా మిల్లులో పని చూపించాడు. ఇంతలో ఆ ప్రాంతమంతా కలరా వ్యాపించి ఆయన తల్లి తమ్ముడు బలైపోయారు. అంత్య క్రియలకు కూడా సొమ్ము లేని దయనీయ స్థితి.

తర్వాత కాలంలో కాళీశ్వర మిల్లులో పని దొరికిన రమణి కార్మికుల దయనీయస్థితిగతులపై కలత చెందాడు. యూనియన్‌లో చురుగ్గా పనిచేయడం మొదలెట్టాడు. మాతృభాష మళయాలంతో పాటు తమిళం ఇంగ్లీషులు కూడా నేర్చుకున్నాడు. అప్పుడే స్వాతంత్ర్య పోరాటం వైపునకు ఆకర్షితుడైనాడు .యూనియన్ నాయకుడి లాలూచీ పోకడలు పసిగట్టిన రమణి తదితరులు వేరే యూనియన్ పెట్టుకోవడం మంచిదని నిర్ణయానికొచ్చారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులైన పి.రామమూర్తి తదితరుల సూచనలపై మరో యూనియన్ ఏర్పరచి ఉధృత సమ్మె పోరాటంతో హక్కులు సాధించుకున్నారు. మొదట సోషలిస్టు పార్టీలో చేరిన రమణి తర్వాతి కాలంలో సహజంగానే కమ్యూనిస్టుగా మారి కోయంబత్తూరులో తొలిశాఖను 1939లో ఏర్పాటు చేశాడు. ఆ వెంటనే జరిగిన ఒక ఘటనలో తప్పుడు ఆరోపణలతో ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు.జైలులో తక్కిన కమ్యూనిస్టు ఖైదీలతో పాటు రమణి రాజకీయ తరగతుల ద్వారా సిద్ధాంత పరిజ్ఞానం బాగా పెంచుకున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధ

సమయంలోనూ జైలుకు వెళ్లాడు. ఆ కాలంలోనే కొయంబత్తూరు సమీపంలోని చిన్నయపాలెంకు చెందిన ముగ్గురు కమ్యూనిస్టులకు ఉరిశిక్ష వేశారు.

1946 జూలైలో దక్షిణ రైల్వే కార్మికుల దీర్ఘకాలిక సమ్మెపై ప్రభుత్వం భయంకరమైన దమన కాండ సాగించింది. దాంతో అజ్ఞాతవాసంలోకి వెళ్లిన రమణి అలా వుంటూనే మిల్లు కార్మికుల సమ్మెకు ఆధ్వర్యం వహించాడు. ఆ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒకేసారి 11 మంది కార్మికులు నేలకొరిగారు. ఎలాగో రమణిని అరెస్టు చేసిన పోలీసులు దారుణమైన చిత్రహింసలకు గురి చేసినా తట్టుకుని నిలబడ్డాడు. ఆ ప్రాంతంలోనే ప్రముఖ నాయకుడుగా ఎదిగిన ఆయన 1952 మొదటి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరపున శాసనసభకు పోటీ చేసి కేవలం వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయాడు. కార్మికోద్యమంతో పెనవేసుకుపోయిన రమణి అవిభక్త కమ్యూనిస్టుపార్టీ జాతీయసమితి సభ్యుడైనాడు. సిపిఎంగా ఏర్పడటానికి ముందు 1962లోనూ,1964లోనూ ఆయన జైలు శిక్షననుభవించారు. తమిళనాడులో సిపిఎం తొలి కార్యదర్శివర్గంలో సభ్యుడయ్యాడు. 1967లోనే కోయంబత్తూరు నియోజకవర్గం నుంచి పెద్ద మెజార్టీతో పార్లమెంటుకు ఎన్నికైనాడు. అత్యున్నత చట్టసభలోనూ కార్మికవర్గ హక్కులను సంరక్షించే చట్టాల కోసం పోరాడి అనేక సత్ఫలితాలు సాధించాడు. ఈ కాలంలోనే తేయాకు తోటల కార్మికులను సంఘటిత పర్చాడు. కార్మికుల వేతనాల పెంపుదలతో పాటు రైతాంగానికి కూడా 16 వేల ఎకరాల భూమి పంపిణీ చేయించారు. ఇలా రమణి జీవితం యావత్తూ కార్మికుల పోరాటాలతో హక్కుల సాధనతో ముడిపడింది. సిమెంటు కార్మికులకు సంబంధించిన పోరాటాలలోనూ ఆయనది కీలకపాత్రే. కేంద్రంతోనూ, రాష్ట్రంలోని డిఎంకె ఎడిఎంకె ప్రభుత్వాలతోనూ పోరాడి అనేక సదుపాయాలు సాధించేందుకు కారకుడైనాడు. అందుకే సిఐటియులోనూ ముఖ్యబాధ్యతలు నిర్వహించారు. ఎమర్జన్సీలో కూడా ఆయనను అరెస్టు చేయగా ఖైదులో వుండగానే తీవ్రమైన అనారోగ్యానికి గురైనాడు. చివరకు ప్రభుత్వం ఆయనను విడుదల చేయవలసి వచ్చింది. ఎమర్జన్సీ తర్వాత కాలంలో వరుసగా నాలుగు సార్లు ఆయన శాసనసభకు ఎన్నికవడం ఆయన పట్ల గల ప్రజాదరణకు ఉద్యమ బలానికి నిదర్శనం. అనారోగ్యంతో బాధ పడుతున్నా ఆయన పార్టీతో సంబంధాలను కొనసాగిస్తూనే వచ్చారు. కుటుంబ సభ్యులు కూడా చేదోడుగా నిలిచారు.

ఇన్ని విధాలుగా సేవలందించిన రమణి చివరి దశలో అల్జీమర్స్ వ్యాధికి గురై పూర్తిగా జ్ఞాపకశక్తి కోల్పోవడం పెద్ద విషాదం. ఆ దశలోనే ఆయన భార్య శ్యామల క్యాన్సర్ తో చనిపోయినా గుర్తించలేకపోయారు. తర్వాత కొద్ది రోజులకు 2006 మే 30న ఆయన ఆఖరి శ్వాస విడిచారు.

ఉత్తేజ దాయకమైన రమణి జీవిత గాథను రామకృష్ణన్ చాలా క్లుప్తంగా సూటిగా పొందుపర్చడం అభినందనీయం. సిపిఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ పుస్తకానికి చిన్న 'ముందుమాట' రాస్తూ నిరంతరం ఉద్యమాలతో మమేకమైన ఈ కార్మిక నాయకుడిని గురించి ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడగలదని పేర్కొన్నారు. ఆ దృష్టితోనే ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ తెలుగు అనువాదాన్ని వెలువరించింది. టి.జగన్మోహన్ అనువాదం పఠనీయంగా సాగింది. ఆశయపథంలో ఆటుపోట్లకు అలసిపోని ఆదర్శయోధుల జీవితాలకు ఓ ఉదాహరణగా అవశ్యం చదవాల్సిన జీవిత గాథ ఇది, నేటి పాలకవర్గ నేతలు చాలామందిలో కనిపించే నీతిమాలిన వ్యవహారాలకు పూర్తి భిన్నమైన ప్రజానాయకుల నిస్వార్థ నిష్కళంక ప్రజా జీవిత గమనం ఇందులో చూస్తాము.

కామ్రేడ్ కె. రమణి
జీవితం- కృషి
ఎన్. రామకృష్ణన్
వెల:30/-
పేజీలు: 72
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2,
చిక్కడపల్లి, హైదరాబాద్.

*

రేడియో అక్కయ్య శ్రీమతి న్యాయపతి కామేశ్వరి శత జయంతి సందర్భంగా

బాలలకు రాష్ట్రస్థాయి కథారచన పోటీ

ఆంధ్ర బాలానంద సంఘం, ఆలిండియా రేడియో, పిల్లలకోసం నడుపబడిన మొదటి పిల్లల పత్రిక "బాల" మొదలైన రంగాలలో "అన్నయ్య-అక్కయ్య"గా ప్రసిద్ధి చెందిన శ్రీ న్యాయపతి రాఘవరావు, శ్రీమతి కామేశ్వరిగార్లలో ఒకరైన అక్కయ్యగారి శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నాము. ఈ సందర్భంగా పిల్లలలో ఆలోచనాశక్తినీ, సృజనాత్మక కథను పెంపొందించే ఉద్దేశ్యంతో రాష్ట్ర స్థాయిలో కథ రచన పోటీని నిర్వహించాలని నిశ్చయించాము. ఈ పోటీలో పాల్గొనడానికి 7,8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులు.

కథా రచనకు నియమాలు:

1. పిల్లలు స్వతంత్రంగా రాసిన కల్పిత కథలై ఉండాలి. పెద్దవారిచేత రాయించి పోటీకి పంపరాదు. అటువంటి కథల్ని ఇట్టే గుర్తించి పోటీకి స్వీకరించము.
2. జానపద కథలు, సాంఘిక కథలు, జంతువులు పక్షులలో మానవ లక్షణాలను ప్రతిబింబించే కథలై ఉండాలి.
3. కథలు సాటి పిల్లలకు మానసిక ఉల్లాసం కలిగించే విధంగా ఉండాలి.
4. కథ 500 పదాలకు మించరాదు. మంచి దస్తూరితో రాయాలి.
5. కొట్టివేతలు, దిద్దటాలు ఉండరాదు. సింగిల్ రూలులో లైను విడిచి లైనులో వ్రాయాలి.
6. కథ స్వంతం అనే హామీ పత్రాన్ని కథతో పాటు సంతకం చేసి పంపాలి. ఇది మా అబ్బాయి/ అమ్మాయి స్వంత కథే అని తల్లిదండ్రులు కూడా ధృవీకరించి సంతకం చెయ్యాలి.
7. హామీ పత్రంలో మీ వయస్సు, మీరు చదువుతున్న తరగతి, పాఠశాల పేరు, మీ చిరునామా, ఫోను నెంబరు తప్పనిసరిగా ఉండాలి.

పై నియమాలు పాటించని రచయితల కథలు పోటీకి స్వీకరించబడవు.

కథలు మాకు చేరవలసిన ఆఖరు తేది: నవంబరు 10, 2008

ఎంపిక చేసిన 25 కథలు పుస్తకంగా ప్రచురించి 24 డిసెంబరు సాయంత్రం రవీంద్రభారతిలో జరిగే శతజయంతి ముగింపు ఉత్సవంలో ఆవిష్కరించబడుతుంది.

ఆ వేడుకలలో ఈ బాల రచయితలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించబడతాయి.

మా చిరునామా:
అక్కయ్య శతజయంతి కథా రచన పోటీ
10, బాలానందం
నారాయణగూడ, హైదరాబాదు-500027.
ఫోను: 27561443

(జె.వి. కామేశ్వరి) (మలపాక పూర్ణచంద్రరావు)
సమన్వయకర్తలు


సత్తార్ ITC

సత్తార్ ITC


సత్తార్ ITC


సత్తార్ ITC


BUS STOP
సత్తార్ ITC


మీరు టై అంత బిర్రుగా కట్టుకోకపోతే నా దగ్గరి కొచ్చే పనుండేది కాదు!!
డా॥ధమ్
Ramu


మొన్న రిలీజైన పిక్చర్లో నేను నటించా చూశావా?
ఏది ఆ ఘోస్ట్‌మేన్‌గా నేగా!!
Ramu

చదువు మీద దృష్టి లేదే

మా బాబు వయస్సు ఐదు సంవత్సరాలు. స్కూలుకెళ్తున్నాడు. కానీ, పాఠాల మీద దృష్టి పెట్టడు. టీచర్లు సరిగా ఆసక్తి చూపడంలేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఏం చేయాలో తోచటం లేదు. సలహా చెప్పగలరు?

అజయ్, ఒంగోలు.

పిల్లలు చదవాలంటే పుస్తకాల్లో రంగురంగుల బొమ్మలు ఉండేలా చూడండి. కథల పుస్తకాలను ప్రతిరోజూ చదివి వినిపించడం, బొమ్మలు చూపించడం చెయ్యండి. అప్పుడప్పుడు పుస్తకాల షాపులకు తీసుకెళ్లి వారికిష్టమైన పుస్తకం తీసుకోమని చెప్పండి. మీరు ఎక్కడికి వెళ్లినా అక్కడ పదాలను చదివించడం, కొత్త వస్తువుల పేర్లను చెప్పడం, ఆటలతో పదాలను నేర్పించడం చేయండి. వారు చెప్పేది ఎక్కువగా వినండి. అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వండి. ఒక పుస్తకంలో తనకు ఇష్టమైన కార్లు, బైకుల బొమ్మలను అంటించి పేర్లు రాయమని చెప్పండి. రాత్రి పడుకునే ముందు మీరు ఒక కథ చెప్పి, తిరిగి వాళ్లనూ చెప్పమనండి. పత్రికలు, కథల పుస్తకాలు చదివేలా ప్రోత్సహించండి. మీరు చదువుతుంటే తనూ మిమ్మల్ని అనుసరించి చదువుతాడు. ఇలా చేయడం వల్ల మీ బాబులో చదువు మీద ఆసక్తి, ఏకాగ్రత, ఆలోచనా పరిధి, విషయాలపై అవగాహన పెరుగుతుంది. సహనంతో బాబుకు ఇవన్నీ అలవాటు చెయ్యండి. ఆల్ ది బెస్ట్.

ప్రతి దానికీ తిడితే ఎలా!

నేను బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. మా నాన్న గారు ప్రతిదానికి తిడతారు. టీనేజ్‌లో అలా ఉండకూడదు. ఇలా చెయ్యకూడదు కదా అని అంటుంటారు. నేను అమ్మాయిలతో ప్రేమగా మాట్లాడుతుంటాను. దానికీ తిడతారు. నాకు చిరాకు వస్తుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. సలహా ఇవ్వగలరు.

జోసఫ్, మచిలీపట్నం.

టీనేజ్ పిల్లలందరూ తమ తల్లిదండ్రులు ప్రతిదానికీ తిడుతుంటారన్న దురభిప్రాయంతో ఉంటారు. మన మనస్తత్వం వాళ్లకేం అర్థమౌతుందిలే అనుకుంటారు. తల్లిదండ్రులు కూడా టీనేజ్ వయసు నుండి వచ్చిన వారేనని ఆలోచించరు. వారికి టీనేజ్ జీవితం ఎప్పటికీ మరుపురాని జ్ఞాపకమే.. అందుచేత టీనేజ్‌లో మీ మనోభావాలు ఎలా ఉంటాయో మీ తల్లిదండ్రులకు తెలియకుండా వుండవు. అయితే మీ మనోభావాలను రంజింపచేయటం కన్నా, వారికి మీ జీవితాలను సరిదిద్దాల్సిన బాధ్యతే ఎక్కువగా ఉంటుంది. మీరు ఎవ్వరినైనా స్వచ్ఛమైన మనసుతో ప్రేమిస్తే మీ తల్లిదడ్రులు అర్థం చేసుకోగలరు. దాన్ని ఆస్వాదించగలరు. కానీ బూటకపు ప్రేమ వలలో మీరు ఇరుక్కుని అవస్థల పాలయితే కన్న హృదయాలు తట్టుకోలేవు. అందుచేతనే మీ పట్ల బాధ్యతతో వ్యవహరించాలని కటువుగా మాట్లాడతారు. వారిని అర్థం చేసుకుంటే మీ జీవితం ఆనందమయం అవుతుంది.



చదవలేకపోతున్నా

ఒకోసారి చాలా బాధగా, విషాదంగా ఉంటున్నాను. దీనివల్ల నేను సరిగా చదవలేకపోతున్నాను. అన్నీ నెగిటివ్ ఆలోచనలు వస్తున్నాయి. ఈ రోజు బాగా చదవాలనుకుంటాను. కానీ 1లేదా 2 గంటల కన్నా చదవలేక పోతున్నాను. నేను బి.కామ్ చదువుతున్నాను. టైమ్ వేస్ట్ చేస్తున్నానని బాధపడుతున్నాను. కానీ కష్టపడి చదవాలి. మనస్ఫూర్తిగా నా పనిని నేను పూర్తి చేయాలి. సరిగా చదవలేకపోతున్నాను. ఏమైనా టెక్నిక్స్ చెప్పగలరని ఆశిస్తున్నాను.

రాజు, పటాన్‌చెరువు.

"అస్సలు టైమ్ లేదు" అనే మాట ప్రతినోటా విన్పిస్తుంటుంది. విద్యార్థులు ఏం చేయాలో ఎటునుంచి మొదలు పెట్టాలో తెలియక "ప్రస్తుతానికి వాయిదా వేద్దాం" అనే స్థితికి చేరుకుంటున్నారు. ఏం చదువుతున్నారో దానిమీద దృష్టి పెట్టండి. ప్రతిరోజూ టైం టేబుల్ ప్రకారం చదవటం, నోట్సు రాయడం క్లాసుకు హాజరుకావటం చేయండి. ఇవాళ్టి పనిని రేపటికి వాయిదా వేయకండి. రేపు చేయవల్సిన పనిని ఇవాళే చేయండి. ఏం చదువుకోవాలో ముందుగానే అనుకుని ఎవరూ లేని చోట ప్రశాంతంగా కూర్చుని చదవండి. మీరు పెట్టుకున్న టైమ్ టేబుల్‌ను క్రమశిక్షణతో అనుసరించండి. చదవటానికి వీలుగా పాఠ్యాంశాలను విభజించుకోండి. చదివేటప్పుడు

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం:9390044031

అరగంటకొకసారి ఐదు నిమిషాలు గ్యాప్ ఇస్తూ చదవండి. కొత్త విషయాలు నేర్చుకోండి. అప్పుడు మీ మైండ్ చురుకుగా పని చేస్తుంది. ప్రతిరోజు పది నిమిషాలు స్కిప్పింగ్, క్యారమ్స్, చెస్ ఏదో ఒకటి ఆడండి. సమయం పట్ల అవగాహన, విద్యార్థిగా కెరీర్‌పట్ల బాధ్యత మీకు చాలా అవసరం.

మోసం చేస్తున్నారు

నా వయసు 28 సంవత్సరాలు. నాది అందరితో ఉండాలనే మనస్తత్వం. కానీ నన్ను అందరూ నమ్మకంగా మోసం చేస్తున్నారు. ఎంత మోసం చేసినా మళ్లీ వాళ్లు పలకరిస్తే అన్నీ మరచిపోయి ఎప్పటిలాగే ఉంటాను. అలా ఉన్నా గానీ వారు మళ్లీ మోసం చేస్తున్నారు. నాకు ఒక్కోసారి చనిపోవాలనిపిస్తుంది. నన్ను ఏం చేయమంటారు. నాకు మంచి సలహా ఇచ్చి ఈ గండం నుండి తప్పిస్తారని కోరుకుంటున్నాను.

అరుణ, విశాఖపట్టణం.



అందరితో మంచిగా ఉండాలనే ఆలోచన మంచిదే, కానీ అందరూ మిమ్మల్ని మోసం చేస్తున్నారంటున్నారు. ఎలా ఎందుకు మోసం చేస్తున్నారో పరిశీలించారా! అసలు మీరు ఏం చేస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో, ఎలా మాట్లాడుతున్నారో పరిశీలించుకోండి. జరిగిన నష్టాలకన్నా రేపేదో జరుగుతుందని ఆందోళన పడకండి. దృఢ మనస్తత్వాన్ని ఏర్పరుచుకోండి. అప్పుడు ఈ సంకట పరిస్థితి నుండి మీరు తేరుకోగలరు. ప్రశాంతంగా వాస్తవ పరిస్థితులను అంచనా వేయండి. పాజిటివ్‌గా ఆలోచించండి. వ్యక్తిత్వ వికాస పుస్తకాలను చదవండి. ఒక లక్ష్యం ఏర్పరుచుకోండి. అప్పుడు మీమీద మీకు నమ్మకం ఏర్పడుతుంది. ఎప్పుడైతే మీ మీద నమ్మకం ఏర్పడిందో ఎదుటి వాళ్ల గురించి తెలుసుకోగలుగుతారు.

డా॥ జె.పి. వైద్య

ఆఫ్టరాల్...షో తీన్ ఘంటేకా!



అపురూపమైన మహాశిల్పం 'మాయాబజార్' మళ్లీ వస్తుందా? మల్లీశ్వరి, బాటసారి, దేవదాసు, గుండమ్మ కథ, లవకుశ, రైతుబిడ్డ, యోగివేమన, కీలుగుర్రం, బీదల పాట్లు, షావుకారు, పాతాళ భైరవి, విప్ర నారాయణ, మిస్సమ్మ, ఇలవేల్పు ఎప్పుడొస్తాయో? రాజకపూర్, నీలికళ్లు, 'ఆవారా' స్వప్నం చూశాయి....



దేవానంద్ గోముగా 'పేయింగ్ గెస్ట్' అయిపోయాడు... దిలీప్ కుమార్ 'ట్రాజెడీ కింగ్' గా మిగిలిపోయాడు... దాదా ముని 'అశోక్ కుమార్' ఎప్పటికీ సినీ భీష్మాచార్యులవారే.... వి.శాంతారాం 'దో ఆంఖే బారాహాత్' తో అమరుడయ్యాడు... సత్యజిత్‌రే 'అప్పూ'తో కొత్త విశ్వాన్ని పరిచయం చేశాడు.... మన తెలుగువారి రెండు కళ్లు....'నందమూరి' - 'అక్కినేని' సరికొత్త బాటలకు ఆద్యులు.... ఆ జమానా చూసిన కళ్లు ఈ జమానాలోని 'రణగొణ ధ్వని' భరించలేక పోతున్నది. గుడ్డల్లో, వేషధారణలోని 'రేషనింగ్' .... యాక్షన్ పేర్న సాగే 'వీర దంచుడు' జీర్ణం చేసుకోలేకుండా ఉంది.







సినిమా పెద్దోళ్లు మనలాంటి అభిమానులకు రకరకాల 'ఫ్యాషన్ల'ను పుంఖాను పుంఖాలుగా అందించారు. మనం కూడా మురిసిపోయాం. ఎగిరిపడ్డాం. దోసిళ్ల కొద్దీ ఫ్యాషన్లను స్వంతం చేసుకున్నాం.

దేవానంద్ స్వతహాగా ఎవర్‌గ్రీన్ స్టైలిష్ హీరో! బుగ్గన వెంట్రుకల స్టైల్ నుంచి, ఎత్తు కాలర్లు, స్టైలిష్ కోట్లు, టోపీలు, హ్యాట్లు, ఆయన మనకందించారు. షమ్మీకపూర్ కూడా చేతి రుమాళ్లు, టోపీలు సేకరించి మనల్ని ముప్పుతిప్పలు పెట్టినవాడే!

రాజేష్‌ఖన్నాను 'ది ఫినామినన్' అని దేవయానీ చౌబళ్ (స్టార్ అండ్ స్టైల్ లోని ఒకప్పటి ప్రముఖ కాలమిస్ట్) పేర్కొనేది. ఆయన కూడా 'గురూ షర్ట్' లాంటి కుర్తాలను మనకు స్టైల్ రూపంలో బహూకరించాడు. అసలు కారణం- నడుము కాస్త 'వైశాల్యం' పెంచుకోవడం వల్ల ఆయనకు 'ఇన్ షర్ట్' అంతగా నప్పేది కాదు. అమితాబ్ బచ్చన్ ఒక షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. హర్రీ-బర్రీగా ఆయన డ్రెస్ వచ్చింది. తీరా చూస్తే చొక్కా మరీ పొడుగ్గా ఉంది. ఎలా? ఎలా? అని నిర్మాత తల బాదుకుంటే 'బిగ్ బి' కి జాలేసింది. దర్శకులవారూ తల పట్టుకొని కూర్చున్నారు. షూటింగ్ సుదూర ప్రదేశంలో సాగుతోంది. ఆల్టరేషన్ ఇత్యాదులు చేయడానికి తగిన సమయం, వసతులూ లేవు.

కెమెరామ్యాన్ కూడా 'ఏం చేద్దాం?' అని తల గోక్కుంటూ హైరానా పడిపోయాడు.

అమితాబ్ సరదాగా షర్ట్ గుండీలు విప్పేసి. ఇన్‌షర్ట్ చేసే బదులు 'ఫ్రీ ఎండ్స్' ముడేసి నవ్వాడు.

'ఎలా ఉంది?' అని కళ్లెగరేశాడు.

సంతోషం పట్టలేక డైరెక్టర్ 'లైట్స్ ఆన్ -కెమెరా - యాక్షన్- సైలెన్స్' అని అరిచే బదులు 'వహ్వా! సరికొత్త ఫేషనండీ బాబూ' అన్నాడు.

అంతే!

సినిమా రిలీజయ్యాక - మనం చేసిందేమిటీ? గుండీలు పీకి పారేసి, షర్ట్ రెండు చివర్లు ముడివేసి స్టైల్‌గా కదలబోయాం.

- 'దిమాగ్ ఖరాబైంది! పిస పోరగాండ్లు! కొత్త షర్ట్! పీకి ముడేస్తున్నాడు హౌలాగాడి తీరు' అని పెద్దోళ్లు ఉద్ధరించి దీవెనలు పలికారు.

ఈ జమానా ఫ్యాషన్ల గురించి, వింత వేషాల గురించి, అతి విచిత్రమైన పోకడల గురించి ఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిది.

మనవాళ్లు లక్షలు, కోట్లలో 'పారితోషికం' అందుకున్నా - వేషధారణ, ముఖ్యంగా 'గుడ్డల' విషయంలో 'రేషనింగ్' ఎందుకు పాటిస్తున్నారో ఎంత బుర్ర కొట్టుకున్నా అర్థం కాదు.

అమ్మాయి - అబ్బాయి ప్రేమించుకుంటారు. తరతరాలుగా సినిమాల్లోనూ, సమాజంలోనూ 'ప్రేమ' తప్పలేదు.

ప్రేమించడంలో తప్పు కూడా అస్సలు లేదు. వారిద్దరు 'ఏకాంతం' కోసం తిప్పలు పడ్తారు. అందులోనూ కొంతవరకూ అర్థం చేసుకోవచ్చు.

డైరెక్టర్/ప్రొడ్యూసర్ మన నయనానందం కోసం



వారిద్దరినీ 'కలలు కనండి...వెళ్లండి' అని పాత జమానాలో మహామహా అయితే సముద్రం ఒడ్డున, అలలతో ఆడుకోడానికి పంపించేవాడు.

అప్పుడప్పుడు జేబులు వేడిగా ఉంటే ఏ ఊటీకో, మరీ పట్టుపడితే కాశ్మీర్‌కూ పంపించేవాళ్లు.

ఆ రకంగా మన 'జనరల్ నాలెడ్జి' అమాంతంగా పెరిగిపోయింది. ఇప్పుడు జమానా మారింది- తరం మారింది. కథ మారలేదు కానీ, తల రాతలూ, మన కష్టాలూ పెరిగిపోయాయి. కుప్పలు, తెప్పలుగా మంచు కురిసే స్విట్జర్లాండ్, ఆల్ప్స్ పర్వత శిఖరాలూ, విదేశాల పచ్చిక బయళ్లూ, తండోప తండాలుగా జనం కార్లూ రంయ్ మంటూ సంచరించే ప్రపంచ మహానగరాల కూడళ్లూ, బస్సు టాప్‌లూ, విమానం రెక్కలూ, ఆకాశ హర్మ్యాల అంచులూ, ఆపైన కంప్యూటర్ చేసే చిత్ర విచిత్రాలూ... తప్పడం లేవు. ఒక్క టికెట్టు అండతో ప్రపంచాన్ని రెండు మూడు గంటల్లో సునాయాసంగా చుట్టి రాగలుగుతున్నాం మనం.

కానీ, అక్కడా 'గుడ్డల రేషనింగూ' - వీసా, గీసా లేకుండా కుప్పలు తెప్పలుగా 50-100 మంది అమ్మాయిలూ. అబ్బాయిలూ వచ్చి ఒళ్లు నొప్పుల విచిత్ర కదలికలూ, డ్రిల్ ప్రాక్టికల్స్, వద్దన్న చోట జర్కులిచ్చి మాయమైపోతారు.

ఏ మాత్రం వాస్తవికత లేని కోర్టు సీన్లనూ, హాస్పిటల్‌లోని ఆపరేషన్ థియేటర్ దృశ్యాలనూ మనం ఓపిగ్గా జీర్ణం చేసుకుంటున్నాం.

"సభీ కుచ్ హో రహా హై ఇస్ తరక్కే కే జమానేమే మగర్, ఏ క్యా గజబ్ హై ఆద్మి ఇన్సాఁ నహీఁ హోతా?"

(అభివృద్ధి పేరిట ఇంత వింతలూ విడ్డూరాలూ చోటు చేసుకుంటున్నాయి ఈ సువిశాల ప్రపంచంలో.... కాని, ఇదేం ఆశ్చర్యమో! మనిషి... మానవత నిండిన 'మంచి మనిషి' కాలేక పోతున్నాడు)

ఒక తరం విఠలాచార్య గారి 'జమానా'ను అనుభవించింది. మనస్ఫూర్తిగా ఆనందించింది కూడా! కత్తి యుద్ధాలు చేసే రాజకుమారుడూ, ఎప్పుడు చిత్ర విచిత్రమైన జంతువులనూ. భయంకరమైన రాక్షసులను చంపి, చెరలో ఉన్న తల్లిదండ్రులను విడిపించి, శత్రు పక్షం రాజు 'తనయ' రాజకుమారిని స్వీకరించి మనలను ఇంటికి పంపిస్తాడో అని మూడు గంటల టెన్షన్‌ను అనుభవించాం మనం!

అయితే, రసరమ్యమైన 'సదాబహార్' సినీ సంగీతం మన వెంటఉండి, వేటాడింది. నేటికీ ఆత్మీయంగా వెంటాడుతోంది. అప్పుడు రాజకుమారుడు మొండి గుడ్డలేసినా, కత్తి యుద్ధాలు చెయొద్దు మరీ? ధోవతులూ, పంచెలూ కట్టే యుద్ధమెలా చేస్తాడూ? రాజనాల మన హీరో పంచె లాగేస్తే? అని కళ్లెర్ర జేసి, ఆత్మీయంగా హీరోకు బాసటగా, స్ట్రాంగ్ సపోర్ట్‌గా, పెట్టని కోటలా నిలబడ్డ 'రసిక మహారాజులం' మనం!



ఇప్పుడు ఫ్యాషన్ల పేర్న సాగుతున్న వింత పోకడ జీర్ణం కావటం లేదు. ప్రస్తుత జమానా 'రాజకన్య' జోలికి పోదలచుకోలేదు.

బాపు, కె.విశ్వనాథ్, గోవింద్ నిహ్లానీ, శ్యాం బెనెగల్, నర్సింగ్ రావ్, సత్యజిత్ రే, బాసూ భట్టాచార్య, బాసూ చటర్జీ, గుల్జార్, బి.ఆర్ చోప్రా, రిత్విక్ ఘటక్, మృణాల్ సేన్, బుద్ధదేవ్ దాస్ గుప్తా, మణికౌల్, కుమార్ సాహ్నీ, గౌతమ్ ఘోష్, కేతన్ మెహ్తా... అంతెందుకూ, మన చక్రపాణి, బి.యన్. రెడ్డి, హెచ్.ఎమ్.రెడ్డి ల 'హవా' రావాలి.



ఫ్యాషన్ల పేర్న అమ్రేష్‌పురి, ఫిరోజ్ ఖాన్ తలకాయ మీది పిడికెడు తెల్ల వెంట్రుకల అడ్రెసు లేకుండా 'డిప్పు గుండు' చేసుకున్నారు. 'వాటర్' కోసం 'షబానా అజ్మీ' గుండు చేయించుకున్నది. సినిమా కోసం త్యాగాలు చేసిన వాళ్లు కో కొల్లలు.... స్వర్గలోకం ఎలా ఉందో తెలియకున్నా మన సినిమా పెద్దోళ్ల పుణ్యమా అని అన్ని లోకాలు చూడగలుగుతున్నాం మనం. వాస్తవికతలు లేని కలల రమ్యమైన ఏడు రంగుల విషవలయంలో హాయిగా చిక్కుకున్నాం మనం. 2-3 గంటల వరకు ఫర్వాలేదు.

ఆ తర్వాత...?



పాండవులు ఉన్నట్టు ప్రతిక్షణం భావం కల్గించిన అపురూపమైన మహాశిల్పం 'మాయాబజార్' మళ్లీ వస్తుందా?

మల్లీశ్వరి, బాటసారి, దేవదాసు, గుండమ్మ కథ, లవకుశ, రైతుబిడ్డ, యోగివేమన, కీలుగుర్రం, బీదల పాట్లు, షావుకారు, పాతాళ భైరవి, విప్ర నారాయణ, మిస్సమ్మ, ఇలవేల్పు ఎప్పుడొస్తాయో?

రాజ్‌కపూర్, నీలికళ్లు, 'ఆవారా' స్వప్నం చూశాయి....

దేవానంద్ గోముగా 'పేయింగ్ గెస్ట్' అయిపోయాడు...

దిలీప్ కుమార్ 'ట్రాజెడీ కింగ్' గా మిగిలిపోయాడు...

దాదా ముని 'అశోక్ కుమార్' ఎప్పటికీ సినీ భీష్మాచార్యులవారే....



వి.శాంతారాం 'దో ఆంఖే బారాహాత్' తో అమరుడయ్యాడు...

సత్యజిత్‌రే 'అప్పు'తో కొత్త విశ్వాన్ని పరిచయం చేశాడు....

మన తెలుగువారి రెండు కళ్లు....'నందమూరి' - 'అక్కినేని' సరికొత్త బాటలకు ఆద్యులు....

ఆ జమానా చూసిన కళ్లు ఈ జమానాలోని 'రణగొణ ధ్వని' భరించలేక పోతున్నది.

గుడ్డల్లో, వేషధారణలోని 'రేషనింగ్' .... యాక్షన్ పేర్న సాగే 'వీర దంచుడు' జీర్ణం చేసుకోలేకుండా ఉంది.

అయినా!

అలవాటు కొద్దీ ఫస్ట్ డే, ఫస్ట్ షో కోసం సినిమా థియేటర్ కిటికీల దగ్గర కుమ్ములాట కోసం మేము తయారే!

ఏం చేస్తాం?

'తీన్ ఘంటే కా సవాల్ హై!'

❋

అక్షర వాచస్పతి ఆలయాలు - అనుభూతుల యాత్రా జీవనం



దాపరికంలేని నిరాడంబర జీవితం, అక్షరమే వారి సంపద- దాశరథి రంగాచార్య ఇప్పటికి 16,000 అచ్చు పుటలతో 61 గ్రంథాలు రచించారు. వేదాలను సామాన్య ప్రజలకు అందించని పరిస్థితుల్లో దాశరథి "ప్రజలకు వేదం" అందించారు. 1946- 51 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న సమర యోధుడు దాశరథి... విప్లవం నుండి వేదం వరకూ సాగిన వీరి అక్షరయాత్ర ఆలయాలు - అనుభూతులు... భారతదేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు... భద్రాచలం నుండి వైష్ణోదేవి ఆలయం దాకా దాదాపు 476 పేజీల్లో 239 పుణ్యక్షేత్రాలు... దర్శించిన దాశరథి లేఖిని నుండి ఈ "యాత్రాజీవనం" లిఖించబడింది. తెలుగులో తొలి యాత్రా చరిత్రను ఏనుగుల వీరాస్వామి "కాశీయాత్ర చరిత్ర" గా రాశారు. అలాగే కొడాలి సుబ్బారావు "హంపీక్షేత్రం", నాయని కృష్ణకుమారి "శ్రీనగర యాత్రావిశేషాలు" రాశారు. దాశరథి "యాత్రాస్మృతి" రాశారు. కాలక్రమంలో విదేశాలు సందర్శించిన వారు... ఆయాదేశాల పర్యటనల గురించి 'యాత్రా' రచన చేశారు, చేస్తున్నారు. వేద సంస్కృతే మూలం అనే రీతిగా రచించిన ఈ 'యాత్రా జీవనం' ఆధ్యాత్మిక వాదుల్ని బాగా సంతోషపెడుతూ, పాఠకుణ్ణి పురాణ యుగంలోకి కొనిపోతుంది. కానీ భరతదేశచరిత్ర సంస్కృతులకు వేదాలే మూలం కావు కదా!! వేద సంస్కృతికి కొన్ని వందల సంవత్సరాలకు పూర్వమే సింధూనాగరికత, సంస్కృతి వికసించి, వర్థిల్లాయి కదా!!

వేదకాలానికి ముందే ఆర్యేతర సంప్రదాయానికి చెందిన "మునులు" - "శ్రమణులు" ఉండేవారు. యోగధ్యాన ముద్రలలో ఉన్న హరప్పా శిల్పాలే కాక రుగ్వేదంలోని కేశీ సూక్తం కూడా ఈ అంశాన్ని రుజువు చేస్తున్నాయి. కపిల, కృష్ణద్వైపాయన (వ్యాస) పార్శ్వనాథులు, ప్రాక్చారిత్రక ఆర్యేతర "మునులే"... పరిత్యాగం, ధ్యానం, పునర్జన్మ, కర్మ విముక్తి, వంటి తాత్విక భావనలు ఆర్యేతరమైన హరప్పా సంస్కృతిలోంచి వచ్చినవే కదా!!

పుస్తకం అంతా, శైవ, వైష్ణవ మతాలపై ఆలయాలపై స్థల ప్రాశస్త్యంపై దాశరథి బాగానే రాశారు.

1) బౌద్ధం ఆది శంకరుల ప్రభావానికి అంతరించింది. (పుట.185), నాశనం మాత్రమే తెలిసిన ఆంగ్ల చరిత్రకారులు సనాతనులు బౌద్ధాన్ని నాశనం చేశారు.. సిద్ధాంతాలను కూల్చటం అసాధ్యం అని తెలుసుకోవాలి. నా జీవితకాలంలో సోషలిజం అగ్రస్థానానికి చేరింది-అంతరించింది. సోషలిజం తనంతట తానే కూలింది. బౌద్ధం అలాగే అంతం అయింది. అందుకు ఎవరూ బాధ్యులు కారు(పేజి-185). ఇలా విరుద్ధ భావాలతో 'దాశరథి' లాంటి పెద్దలు రాయటం బాగోలేదు. ఈ అభిప్రాయాలతో మనం ఏకీభవించజాలం. ఎందుకంటే ప్రతి అంశాన్ని వాస్తవిక దృష్టితో చూడాలి కదా! సోషలిజం అజేయం. అంతరించదు... మార్క్స్ 1867లో "క్యాపిటల్" రాశాడు. 1848 నాటికే "కమ్యూనిస్ట్ మేనిఫెస్టో" విశ్వవిజ్ఞాన చైతన్య విస్ఫోటనం అయింది... 1871లో ప్యారిస్‌లో విప్లవం విజయవంతమైంది. కార్మిక వర్గం నియంతృత్వం ఏర్పడ్డవైనం ఎవరూ కాదన లేని సత్యం. 1917లో రష్యా విప్లవ విజయకేతనం... ప్రపంచ దశను మార్చలేదా? 3వ వంతు భూభాగం కమ్యూనిస్టు కేతనం కింద నిలబడ్డ విషయం శ్రామిక వర్గం ఎప్పటికీ విస్మరించరు. 16 దేశాల్లో సోషలిస్ట్ రాజ్యాలేర్పడ్డాయి కదా! 400 దేశాల్లో ఎర్రజెండా క్రింద శ్రామిక వర్గం సమీకృతం కాబడి... కోటానుకోట్ల మంది కమ్యూనిస్టులుగా మారిన వైనం మరువలేనిది. నేతల వైఫల్యాల్ని సిద్ధాంత వైఫల్యంగా చూడరాదు...

మానవ జాతికి 2,500 సంవత్సరాల తరువాత కూడా వసివాడని ప్రేమ- శాంతి- సందేశాలను ఆవిష్కరించిన మానవతా మూర్తి జన్మించినస్థలం దర్శించబోతున్నామనే ఆనంద అవేశాలతో సాగుతున్నాం. (లుంబిని- బుద్ధ భగవానుని జనన స్థలం) (పేజి 470) ఎడ్విన్ అర్నాల్డ్ 'లైట్ ఆఫ్ ఏషియా' అనే బుద్ధుని చరిత్ర కమ్మని ఆంగ్ల కావ్యం రాశాడు. గడచిన కలియుగ సంవత్సరాలు 5106 - పార్థివ నామ సంవత్సరం 2006-07(పేజి 351) సృష్టి ప్రారంభం అవుతుంది. 432 కోట్ల సంవత్సరాలు కొనసాగుతుంది. అది బ్రహ్మకు ఒక్క పగలు... 432 కోట్ల సంవత్సరాల తర్వాత జల ప్రళయం వస్తుంది. అప్పుడు నీరు తప్ప ఏమీ ఉండదు. - అట్లా 432 కోట్ల సంవత్సరాలు ఉంటుంది. అది బ్రహ్మకు రాత్రి...(పేజి346) కృత యుగం 17,28,000 సంవత్సరాలు, త్రేతాయుగం-12,96,000 సంవత్సరాలు, ద్వాపరయుగం-8,64,000సంవత్సరాలు, కలియుగం- 4,32,000 సంవత్సరాలు(పేజి301-302), తేదీలు, దస్తావేజులు... ఇవికావు చరిత్ర సారం... జీవ మానవ పరిణామాన్ని విశ్లేషించిన డార్విన్, గగనతలంలో తొలిసారిగా యాత్ర చేసిన యూరిగగారిన్, చంద్రునిపై కాలు పెట్టిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, అపారమైన విద్యా వైజ్ఞానికాంశాల్ని తొట్టతొలిగా అందించిన ప్రథమ సోషలిస్ట్ శిబిరం విజయాలు ఆధ్యాత్మిక వెనుక చూపులో పడిన వృద్ధతరం గుర్తు చేయనంత మాత్రాన చరిత్ర మారిపోదు.. మాసిపోదు... న్యూటన్‌లను, కోపర్నికస్‌లను సమాధి చేసినా... సత్యం.. సత్యంగానే నిలుస్తుంది. "తత్వవేత్తలు సమాజాన్ని పరిపరి విధాలుగా నిర్వచించారు. కానీ కావలసింది దాన్ని మార్చడం" అన్నాడు మార్క్స్... ఆ దిశగా దాశరథి అక్షర యాత్రాయానం సాగితే బాగుండేది... ఆర్య, ఆర్యేతర, సింధురాగరికత, యుగాల పరిణామాలు విపులీకరిస్తే బాగుండేది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో దాశరథి విరచించిన మోదుగుపూలు, చిల్లర దేవుళ్లు- లాంటి నవలలు... కీర్తినే గాక... యువతకు స్ఫూర్తినిచ్చాయి... భారతదేశ పవిత్ర పుణ్యస్థలాలు... యాత్ర చరిత్ర అధ్యయనం చేసే వయోధికులకు ఈ గ్రంథం మంచి ఔషధిలా పనిచేస్తుంది.

యాత్రాజీవనం- ఆలయాలు - అనుభూతులు , అక్షర పేజీలు : 480 , వెల: 190 రూ॥ , రచన: డా॥ దాశరథి రంగాచార్య, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు.

-తంగిరాల చక్రవర్తి



General knowledge 2009
Current affairs
sree vaasavya
Rs: 20/,-
Pages:120
For copies:
Sri Balaji Publications,
Vijayawada.



Learn Computer courses
(For basic learning)
G.Ramu
Rs: 50/-
Pages: 140,
For copies:
Sri Balaji Publications,
Vijayawada.



మెత్తగ ...నత్తలు

పాకుతు వుంటే...

టియానా వాల్టన్ తొమ్మిదేళ్ల పిడుగు. తనది ఆస్ట్రేలియా. ఈ మధ్యే తను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకెక్కింది. ఎలాగంటారా! ఇలాగే! మొహం మీద పాతిక నత్తపిల్లలను ఎక్కించుకొని!! అవి ముక్కు మీద ... కళ్ల మీద... నోటి మీద మెత్తగా..చల్లగా... పాకుతూ వుంటే మరొకరికైతే ఒళ్లు జలదరిస్తుంది. భయం వేస్తుంది. కానీ ఆ పాప మాత్రం వాటిని ధైర్యంగా పది సెకన్లపాటు వుంచేసుకుంది. దాంతో గిన్నిస్ బుక్‌లో తన పేరు నమోదైంది.

ఎత్తుమడాల చెప్పలతో

పరుగో పరుగు

బాబోయ్ బాబోయ్ ఇవి మామూలు పరుగుపందాలు కావండీ బాబు. ఎత్తుమడాల చెప్పలతో పరుగు పందాలు. చూశారుగా. మూడు అంగుళాల ఎత్తున్న చెప్పలతో ఈ అమ్మాయిల్లు పరుగు పందెంలో పాల్గొన్నారు. ఇంతకీ ఈ పోటీ ఎక్కడ జరిగిందంటారా! సిడ్నీలో. వీళ్లు ఇంతెత్తు చెప్పలతో 80 మీటర్ల దూరం పరుగుతీశారు. 265 మంది పాల్గొన్న ఈ పోటీలో బ్రిటనీ మెక్‌గ్లోన్ అనే పద్దెనిమిదేళ్ల అమ్మడు అందరికంటే ముందర గమ్యం చేరింది. 4,250 డాలర్ల ప్రైజ్ మనీ కొట్టేసింది. మరి ఆ మాత్రం ప్రతిఫలం లేకపోతే అంత రిస్క్ ఎవరు తీసుకుంటారు చెప్పండి.

కొంగ జపం

అనగనగా ఒక కొంగ. మాంచి పొడగరి. కాళ్లు మరీనూ. ఓ చెరువు ముందర పెద్ద మర్రి చెట్టుమీద దాని మకాం. ఆకలేస్తే చాలు తెల్లటి రెక్కలాడించుకుంటూ వెళ్లి చెరువులో నిలబడేది. తన బారాటి ముక్కుతో లటక్కన చేపలు పట్టుకుని గుటుక్కున మింగేసేది. ఇదంతా వయసులో వున్నప్పుడు. పుట్టిన ప్రాణులెవరికైనా వార్ధక్యం తప్పదు కదా. ఈ కొంగ కూడా ముసలిదైపోయింది. అప్పుడు మొదలయ్యాయి దాని కష్టాలు. ఇది చెరువులో నిలబడినా చేపలు పట్టించుకోవడం మానేశాయి. అటూ ఇటూ చలాకీగా తిరుగుతూ దాన్ని ఆటపట్టించసాగాయి. దాంతో పాపం కొంగకు కడుపు నిండడమే కష్టమైంది. వయసు పైబడినా తెలివి మాత్రం బానే వుంది. బాగా ఆలోచించగా ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది. వెంటనే వెళ్లి చెరువులో నిలబడింది తన స్టైల్లో. ఒక కాలు ఎత్తి ఒక కాలు మాత్రమే నీళ్లలో పెట్టి జపం చేస్తున్నట్టు వుండిపోయింది. అలా ఒక పూటంతా వుండిపోయింది. కొన్ని అల్లరి చేపలు దాని దగ్గరగా వెళ్లినా ... దాన్ని తాకినా... ఉలుకూ పలుకూ లేకుండా అలా వున్న కొంగను చూచి అవి ఆశ్చర్యపోయాయి. నీటి జంతువులన్నీ కలిసి ఒక సమావేశం ఏర్పాటుచేసుకుని ఈ విషయాన్ని వింతగా చర్చించుకున్నాయి. అన్నీ కలిసి ఎండ్రకాయను రాయబారం పంపాయి. అది వెళ్లి

"కొంగమావా...కొంగమావా! ఇవాళేంటి నీ వరస కొత్తగా వుంది? ఇదివరలో చేపపిల్ల కనిపిస్తే చాలు చప్పరించేసేవాడివి. ఇవాళ అలా జపం చేస్తూ వుండిపోయావేంటి?!!" అనడిగింది ఆశ్చర్యంగా. కొంగ ఏం సమాధానం చెప్తుందోనని చిన్నాపెద్దా చేపలు, తేళ్లు, తాబేళ్లు, వానపాములు, పాములు, నత్తలు వంటి జలచరాలన్నీ ఊపిరి బిగబట్టి చూస్తుండిపోయాయి.

"ఓ...ఎండ్రకాయ బావా! నువ్వా... ఏమని చెప్పను. నేను మొదటి నుంచి ఈ చెరువు మీదే బతికాను. అందుకని నాకు దీని మీద, ఇందులో నివసించే జీవుల మీద ఎంతో ప్రేమ, అభిమానం, గౌరవం వున్నాయి. కానీ ఇంత పెద్ద కష్టం వచ్చిపడుతుంటే చూస్తూ వుండలేకపోతున్నాను. ఎంతో బాధగా వుంది. ఈ చెరువుకోసం, మీకోసం నా ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా వున్నాను..." అంటూ పెద్దగా ఏడ్చేసింది.

మళ్లీ ఎండ్రకాయ తన నేస్తాల దగ్గరకెళ్లి చర్చించి తిరిగి కొంగ దగ్గరకొచ్చి...

"ఏం జరిగింది మావా?" అడిగింది కంగారుగా.

"నేను నిన్న మర్రి చెట్టుమీద కూర్చుని వుండగా...ఇద్దరు స్వామీజీలు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటూ కనిపించారు. వాళ్ల మాటలు ఆసక్తిగా అనిపించడంతో విన్నాను. అప్పుడు వాళ్లేమన్నారో తెల్సా! మరో పన్నెండు సంవత్సరాల వరకు వర్షాలు వుండవంట. కుంటలు, గుంటలు, చెరువులు, కాలువలు...అన్నీ ఎండిపోతాయంట. మరి మన చెరువు కూడా ఎండిపోతుంది. అప్పుడు ఇందులో వున్న మీరంతా నీళ్లు లేక చనిపోతారుకదా. ఏం చేయాలో తోచడంలేదు.." అంది బాధగా కన్నీళ్లు తుడుచుకుంటూ.

ఆ మాటలకు ఎండ్రకాయతో సహా అన్ని జలచరాల హృదయాల్లోనూ ఒకటే ఆతురత, కంగారు బయలుదేరింది. మరి ఏం చేయాలో అర్థంకాలేదు.

మళ్లీ అన్నీ సమావేశమై ఒక నిర్ణయానికొచ్చాయి. ఎండ్రకాయ వెళ్లి ....

"కొంగ మావా! మరి ఏం చేద్దాంటావ్. నువ్వు పెద్దవాడివి. ఏదైనా సలహా ఇవ్వకూడదూ..." అడిగింది.

"బావా...ఈ పక్కనే కొంత దూరంలో దీనికంటే పెద్ద చెరువు వుంది. ఎంత పెద్ద కరువు వచ్చినా సరే అది ఇంతవరకు ఎండనేలేదు. కాబట్టి మీ అందరినీ అక్కడికి చేరుస్తాను. నా ఓపిక నశించి రాలిపోయేవరకు ఆ పని చేస్తాను. మీ అందరినీ అక్కడికి చేర్చాక ఈ వెధవ ప్రాణాలు పోయినా సంతోషమే. నా ఒంట్లోని ప్రతి రక్తపుబొట్టూ కారేవరకు సాయం చేస్తాను..." అంది చాలా ఉదారంగా. జలచరాలన్నీ సంతోషించాయి. కొంగను తెగ పొగిడేశాయి. ఇంక ఆరోజు నుంచి ...అనేకంటే ఆ క్షణం నుంచే చేపలను...ఒక్కొక్కటిగా ముక్కున కరుచుకుని తీసుకెళ్లసాగింది కొంగ. పాపం కొంగ తమకు చేస్తున్న సాయం చాలా గొప్పదని దాన్ని దేవతలా చూడసాగాయి జలచరాలన్నీ...

కానీ ఎందుకో ఎండ్రకాయకు మాత్రం లోలోన కొద్దిగా గిలిగానే వుంది. కొంగమావ స్వతహాగా చేపలప్రియుడు. అలాంటిది ఈ అమాయక చేపలను నోట కరుచుకొని నిజంగానే పెద్ద చెరువులోకి తీసుకెళ్లి వదులుతున్నాడా? లేడా? అన్న అనుమానం వచ్చింది. అది కనిపెట్టడం కోసం... ఆరోజు కొంగ దగ్గరకెళ్లి...

"కొంగ మావా! ఇప్పటి వరకు నువ్వు బోలెడన్ని చేపలను తీసుకెళ్లి పెద్ద చెరువులో వదిలిపెట్టావు. పాపం అవి ఎట్లా వున్నాయో ఏంటో? వాటి మంచీ చెడూ చూసుకోడానికి ఒక్క పెద్ద దిక్కన్నా లేదు. నేను కూడా అక్కడకు వెళతాను. నన్ను తీసుకెళతావా?!" అనడిగింది.

కొంగ అది చెప్పినట్టే చేసింది. ఎండ్రకాయ తన కొండీలతో కొంగ మెడ పట్టుకొంది. అలా చాలా దూరం ప్రయాణం చేశాక పెద్ద చెరువు కనిపించింది ఎండ్రకాయకు. అక్కడ పెద్ద పెద్ద బండలమీద బోలెడన్ని చేప ముళ్లు కనిపించాయి. అంతే ఎండ్రకాయ ప్రాణాలు పోయినంత పనైంది. అంటే...ఈ మాయదారి కొంగమావ ఇప్పటి వరకు తీసుకెళ్లిన చేపలను శుభ్రంగా భుజించాడన్నమాట. ఎంత టక్కరి పని చేశాడూ..." అనుకుని..."దీన్ని ఇలా వదిలిపెడితే చెరువులో వున్న అన్నిటినీ తినేస్తుంది. గుణపాఠం నేర్పాల్సిందే..." అనుకుని ఒక్కసారిగా కొంగ మెడ కొరికేసింది...

ఏం జరుగుతుందో అర్థమయ్యేలోగానే... బాగా ఆలస్యమైంది. కొంగ మెడ నుంచి రక్తం కారసాగింది.

"ఏం బావా...నా మెడ కొరుకుతున్నావేంటి? మీకు ఎంత మేలు చేశాను..." అనడిగింది ఒక్కో అక్షరం బలవంతాన పలుకుతూ.

"నువ్వు చేసిన మేలుకు ప్రత్యుపకారం మావా ఇది. కింద మావాళ్ల ఎముకలు చూశాక...ఇలా చేయాలనిపించింది.నువ్వు మాకు చేసిన మోసానికి ఇదే సరైన జవాబు. అనుభవించి చావు" అంటూ మెడ పూర్తిగా కొరికిపారేసింది. అంతే. కొంగ మెడ మాత్రం ఎండ్రకాయ నోట్లో వుండిపోయింది. మిగతా శరీరమంతా కింద పడిపోయింది. ఎండ్రకాయ కొంగ మెడ తీసుకొని తమ చెరువు దగ్గరకెళ్లింది. అప్పుడే వెనక్కి తిరిగి వచ్చిన నేస్తాన్ని చూచి

"ఏం మావా అప్పుడే వచ్చేశావు. కొంగ బావేది?" అనడిగాయి ఆతృతగా.

"పిచ్చి మొహాల్లారా! మీరు ఇంత అమాయకులు కాబట్టే అది అంతగా మోసం చేసింది..." అంటూ జరిగిందంతా చెప్పి కొంగ మెడను చెరువు గట్టున వదిలింది. తమ నేస్తాలు ప్రాణాలు కోల్పోయినందుకు బాధగా వున్నా... కొంగ చచ్చినందుకు మాత్రం సంతోషించాయి. ఇంక ఎవరేం చెప్పినా అమాయకంగా నమ్మకూడదని అందులో నిజానిజాలెంతో తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించుకున్నాయి.

- సాహిల్ .కె